
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
బుధవారం, 03.06.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 212
పేజీలు: 08 వెల: రూ. 5



# బీజేపీకి గుడ్‌బై!
## ఐదు పేజీల లేఖతో అన్నామలై షాక్

- కేంద్ర నేతృత్వంపై అసంతృప్తి
- సొంత పార్టీతో ఉపఎన్నికల్లో పోటీ
- కొత్త పార్టీ దిశగా అన్నామలై అడుగులు
- విజయ్ విజయంతో మారిన రాజకీయ సమీకరణాలు
- కొత్త వ్యూహంతో ముందుకు యువనేత
- 'అన్నామలై 2.0'కు శ్రీకారం..
- తమిళ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి సంకేతాలు

**ముద్ర డెస్క్ :**
తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న ఐపీఎస్ మాజీ అధికారి, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కే.అన్నామలై ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌లను కలిసి తన 5 పేజీల రాజీనామా లేఖను సమర్పించారు. కొద్ది రోజులుగా అన్నామలై తదుపరి అడుగులపై సాగుతున్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది.

**ఢిల్లీలో హైడ్రామా - లేఖలో ఏముంది?**
ఆరేళ్లుగా తమిళనాట బీజేపీకి 'స్టార్' ఇమేజ్ తెచ్చిన అన్నామలై, తాజాగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఐదు పేజీల సుదీర్ఘ లేఖలో ఆయన పార్టీ కేంద్ర నాయకత్వంతో తనకు ఉన్న వ్యూహాత్మక విభేదాలను స్పష్టంగా ప్రస్తావించినట్లు తమిళ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తో పొత్తు పెట్టుకోవాలన్న ఢిల్లీ పెద్దల నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ స్వతంత్రంగా ఎదగాలని తాను కోరుకుంటే, అధిష్ఠానం ద్రవిడ పార్టీలపై ఆధారపడటాన్ని జీర్ణించుకోలేకపోయారు. మిగతా 02లో

# పక్క రాష్ట్రాలతో గిల్లి కజ్జాలేంటి?
03
## సీఎం రేవంత్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రధాన పాత్ర బీజేపీదే..
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వేళ సంచలన వ్యాఖ్యలు



పక్క రాష్ట్రాలతో స్నేహ పూర్వక సంబంధాలు పెట్టుకోకుండా గిల్లి కజ్జాలు ఎందుకని కేంద్ర మంత్రి బండి సంజయ్ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఆవిర్భావోత్సవాన్ని పురస్కరించుకొని నాంపల్లి లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జెండాతో పాటు జాతీయ జెండా ఆవిష్కరించారు.

# ప్రపంచానికి గేట్‌వేగా తెలంగాణ
## తెలంగాణ రైజింగ్-2047తో సాధిస్తాం
### రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో సీఎం విజన్!

- సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకావిష్కరణ
- పోలీసుల గౌరవ వందనం స్వీకరణ
- గన్‌పార్క్‌లో అమరవీరులకు నివాళులర్పించిన ముఖ్యమంత్రి
- రాష్ట్రవ్యాప్తంగా సంబరాల్లో పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు
- 6 వేల మంది అతిథుల రాకతో 1,140 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత
- మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు




**ముద్ర, డెస్క్ :**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి



ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పించిన సీఎం, వారి త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం దిశగా ప్రజా ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని పేర్కొన్నారు.

**అమరవీరుల త్యాగాలే తెలంగాణకు పునాది**
దశాబ్దాల ఉద్యమం, ఎన్నో త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి తెలంగాణ సమాజం ఎప్పటికీ రుణపడి ఉంటుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు విలువలను కాపాడుతూ కొత్త చరిత్ర సృష్టించారని కొనియాడారు.

**ప్రజల సేవే ప్రభుత్వ ధ్యేయం**
ప్రజలు తమకు ఇచ్చిన అధికారాన్ని పాలనగా కాకుండా బాధ్యతగా భావిస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం అంటే కొద్దిమంది చేతుల్లో అధికారం కాదని, నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధిగా పనిచేసే వ్యవస్థ అని చెప్పారు. అందుకే తమ పాలనను 'ప్రజా ప్రభుత్వం'గా అభివర్ణిస్తున్నాం అన్నారు.

**రైతుల అభ్యున్నతికి ప్రాధాన్యం**
తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక అని పేర్కొన్న సీఎం.. రైతుల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు తెలిపారు. 2025-26లో రాష్ట్రంలో 236.87 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి నమోదైందని వెల్లడించారు. రైతులపై ఉన్న అప్పు భారాన్ని తగ్గించేందుకు ఒకేసారి రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేశామని, రూ.20,616 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసి దాదాపు 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసినట్లు తెలిపారు. రైతు భరోసా పథకం కింద ఇప్పటివరకు రూ.27,529 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశాం అన్నారు. మిగతా 02లో



# తెలంగాణ సంస్కృతి, వారసత్వం గొప్పది
03
## అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న మోదీ

వికసిత్ భారత్‌లో తెలంగాణ పాత్ర కీలకం
రాష్ట్ర ఆవిష్కరణ పారిశ్రామిక స్ఫూర్తికి నిదర్శనం
రేవంత్, కేసీఆర్ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలు తీర్చేలా పదేండ్ల పాటు తమ పాలన సాగిందని గుర్తు చేశారు.

# టీజీపీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్
## 290 ఉద్యోగాల భర్తీకి 3 నోటిఫికేషన్లు

అత్యధికంగా ఆర్అండ్‌బీలో 222 ఉద్యోగాలు భర్తీ
18-44 ఏళ్ల వారికి.. వయో సడలింపులు వర్తింపు
జూన్ 6 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ




02
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని రోడ్లు, భవనాల శాఖతో పాటు కాలుష్య నియంత్రణ మండలిలో ఖాళీగా ఉన్న 290 ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి మూడు నోటిఫికేషన్లను విడుదల చేసింది.

# సర్‌పై అప్రమత్తం కావాలి
## ప్రతి అర్హుడి ఓటు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

- సర్ ప్రక్రియలో టీడీపీతో పాటు ఎన్డీఏ మిత్రపక్షాల సమన్వయం కీలకమని వ్యాఖ్య
- జూన్ 25 నుంచి 45 రోజుల పాటు సైకిల్ యాత్రతో ఇంటింటి ప్రచారం
- ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు
- వైసీపీపై అప్రమత్తంగా ఉండాలని, నాయకులు ప్రజల విశ్వాసం నిలబెట్టుకోవాలని సూచన

04



# పవన్ కల్యాణ్ ఓ పెయిడ్ ఆర్టిస్ట్
## రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- నా దగ్గర డబ్బులు ఉంటే ఒక క్యారెక్టర్ చేయిస్తా
- మంత్రి సంచలన కామెంట్స్

03



# పుష్కర తెలంగాణ ముష్కరుల పాలైంది
## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



- లివింగ్ లెజెండ్ కేసీఆర్
- 2028 డిసెంబర్‌లో కేసీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారు

04

# నైరుతి రాక ఆలస్యం
## కేరళ తీరాన్ని తాకి మందగించిన రుతుపవనాల కదలికలు

- జూన్ 5-6 తేదీల్లో కేరళలోకి ప్రవేశించే అవకాశం
- వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ ప్రభావమే ఆలస్యానికి కారణమంటున్న నిపుణులు
- మరో 3-4 రోజులు వెనక్కి వెళ్లిన వర్షా కాల ప్రారంభం

02




# మీ అయ్య జాగీరా?
## నా గుండెల్లో తెలంగాణ ఉంది
### జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంచలన కామెంట్స్

- నా ఫాంహౌస్ లో చెరువు శిఖం లేదు..
- ఉందని నిరూపిస్తే నా ఇల్లుని తెలంగాణ ప్రభుత్వానికి రాసిచ్చేస్తా




**ముద్ర డెస్క్ :**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో సంచలన ప్రెస్‌మీట్ పెట్టారు. తెలంగాణలో గత కొద్ది రోజులుగా జనసేన, పవన్ కేంద్రంగా జరుగుతున్న రాజకీయ పరిణామాలపై స్పందించారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, వచ్చే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పోటీతోపాటు ఈ మధ్య కాలంలో తనపై తెలంగాణలో జరుగుతున్న దాడిపై పవన్ సంచలన ప్రెస్‌మీట్ పెట్టారు. "ప్రతిసారీ తెలంగాణ గురించి మిగతా 02లో

## ఇదీ AI ముద్ర



## ముందస్తు విద్యా బడ్జెట్



పిల్లల స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్‌ల కోసం జూన్ నెల రాకముందే ప్రత్యేకంగా కొంత డబ్బును పక్కన పెట్టుకోవాలి. దీనివల్ల ఒకేసారి వచ్చే విద్యా ఖర్చుల భారం కుటుంబ ఆర్థిక పరిస్థితిపై పడకుండా ఉంటుంది.

## ప్రపంచానికి గేట్‌వేగా
# తెలంగాణ



(మొదటి పేజీ తరువాయి)

**ధాన్యం కొనుగోళ్లు**

రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ధాన్యం కొనుగోళ్ల కోసం రూ.82,840 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. యాసంగి సీజన్‌లో దేశవ్యాప్తంగా సేకరించిన ధాన్యంలో తెలంగాణ వాటా 60 శాతం ఉండటం రాష్ట్ర వ్యవసాయ శక్తికి నిదర్శనమని అన్నారు.

**మహిళా సాధికారత**

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని సీఎం చెప్పారు. మహిళా సంఘాలకు రూ.1 లక్ష కోట్లు రుణాలుగా అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామని తెలిపారు. ఇంకా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళా శక్తి భవనాల నిర్మాణం వంటి పథకాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నాయన్నారు.

**ఉద్యోగాల భర్తీ**

యువతకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామని సీఎం తెలిపారు. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, మెగా డీఎస్సీతో పాటు వివిధ శాఖల్లో 67,763 పోస్టులను భర్తీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామని చెప్పారు. త్వరలోనే పలు శాఖల్లో కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

**విద్యా రంగంలో మార్పులు**

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టామని తెలిపారు. పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ తరగతుల విస్తరణతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు భరోసా**

పేదలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో మొదటి ఏడాదే రూ.22,500 కోట్లు కేటాయించి 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు సీఎం తెలిపారు. ఇప్పటివరకు లక్ష ఇళ్లు పూర్తయ్యాయని, సెప్టెంబర్ 17 నాటికి మరో రెండు లక్షల ఇళ్లు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

**సామాజిక న్యాయానికి పెద్దపీట**

దేశంలోనే తొలిసారిగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వేను తెలంగాణ విజయవంతంగా నిర్వహించిందని సీఎం చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని ప్రభుత్వం ఆమోదించిందని, ఎస్సీ ఉపవర్గీకరణను కూడా అమలు చేస్తున్నామని తెలిపారు.

**ఆరోగ్య రంగానికి భారీ పెట్టుబడులు**

రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.11 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు సీఎం వెల్లడించారు. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆసుపత్రులు, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనం, 17 మెడికల్ కాలేజీల నిర్మాణం కొనసాగుతోందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు.

**తెలంగాణ రైజింగ్-2047**

రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించిన “తెలంగాణ రైజింగ్–2047” విజన్ డాక్యుమెంట్‌ను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధికి మూడంచెల వ్యూహం రూపొందించినట్లు చెప్పారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సర్వీసెస్ హబ్‌గా, ఔటర్ రింగ్ రోడ్–రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని తయారీ పరిశ్రమల కేంద్రంగా, మిగతా ప్రాంతాలను వ్యవసాయ ఆధారిత అభివృద్ధి మండలాలుగా తీర్చిదిద్దే ప్రణాళిక ఉందన్నారు.

**2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ**

2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణను దేశానికే కాదు, ప్రపంచానికి గేట్‌వేగా నిలబెట్టేందుకు ప్రజల సహకారం అవసరమని పిలుపునిచ్చారు. “తెలంగాణ రైజింగ్–2047 కేవలం ఒక విజన్ కాదు.. రాబోయే తరాల భవిష్యత్తును నిర్మించే మహత్తర కార్యాచరణ” అని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.

# బీజేపీకి గుడ్‌బై!



(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపులో అన్నామలై అభిప్రాయాలను కేంద్ర నాయకత్వం పక్కన పెట్టింది. తనకు కేవలం ఆరు స్థానాల బాధ్యతలు మాత్రమే అప్పగించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి చెందారు. ఫలితంగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావడం, పార్టీ ఘోర పరాజయం పాలుకావడంతో అన్నామలై వాదన నిజమైంది. బీజేపీలో తనకు తగినంత స్వేచ్ఛ, భవిష్యత్తు లేవని భావించిన ఆయన, సుదీర్ఘ చర్చల అనంతరం కమలం గూటి నుంచి బయటకు రావడమే ఉత్తమమని భావించారు.

**ఉపఎన్నికల్లో పోటీ..**
**సొంత పార్టీ దిశగా అడుగులు**

అన్నామలై రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదు, పైగా మరింత దూకుడు పెంచబోతున్నారు. రాబోయే ఉపఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా లేదా సరికొత్త వేదిక ద్వారా పోటీ చేసేందుకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు. రాబోయే 6 నుంచి 8 నెలల కాలంలో ఒక కొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించే యోచనలో ఆయన ఉన్నారు. తమిళ అస్థిత్వం – జాతీయ దృక్పథం అనే సరికొత్త స్లోగన్‌తో, ఒక సెక్యులర్ ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేయడమే ఆయన తదుపరి కార్యాచరణగా తెలుస్తోంది.

**తమిళనాట విజయ్ ఫ్యాక్టర్..**
**మారుతున్న సమీకరణాలు**

ప్రముఖ నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రం చేసి ఘనవిజయం సాధించడంతో తమిళనాడు రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ద్రావిడ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకే , బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ఒక కొత్త శక్తి వైపు యువత మొగ్గు చూపుతోందని అన్నామలై గమనించారు. బీజేపీ సిద్ధాంతాల ముద్ర వల్ల తమిళనాడులో ఎదగడం కష్టమని గ్రహించిన ఆయన, విజయ్ తరహాలోనే ద్రావిడ సంస్కృతి, అవినీతి రహిత పాలన అజెండాతో యువతను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే పలువురు యువ నిపుణులు, అసంతృప్త నేతలు ఆయనతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. తమిళనాడు బీజేపీకి అన్నామలై రాజీనామా చేయడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బే. ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన ఈ యువనేత, ఇప్పుడు బీజేపీ చట్రం నుంచి బయటకు వచ్చి ఒంటరి పోరాటానికి సిద్ధమయ్యారు. కోయంబత్తూరుతో సహా తమిళనాడు అంతటా ఆయన మద్దతుదారులు ఇప్పటికే అన్నామలై 2.0 పోస్టర్లతో హల్‌చల్ చేస్తున్నారు. మరి ఈ సింగం సొంతంగా పార్టీ పెట్టి ద్రావిడ కోటలను బద్దలు కొడుతుందో లేదో చూడాలి.

# మీ అయ్య జాగీరా

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతుంటే విమర్శిస్తున్నారు. అలాంటి వ్యక్తులకు నా విజ్ఞప్తి, జనసేన తెలంగాణ నడిబొడ్డులో పెట్టాం. ఇవాళ తెలంగాణపై ప్రేమ, ఇష్టం రాజకీయాలకు అతీతమైంది. 2007 నుంచి నాతో ఉన్న నాయకులు వీరంతా. ఇవాళ్టి ఇవాళ్టికి తెలంగాణపై తెచ్చుకున్న ప్రేమ కాదు. విభజన తర్వాత వచ్చిన ప్రేమ కాదు.’ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష రాక ముందే ఇక్కడి సంస్కృతి, పోరాటాలను స్ఫూర్తిగా తీసుకున్నాను. విమర్శించే నాయకులంతా కూడా 2007లో ఎవరూ లేరు. తెలంగాణ నలుమూలల తిరిగిన వాడిని, వెళ్లిన వాడిని, గ్రేటర్ హైదరాబాద్‌లో అన్ని డివిజన్స్‌లో జాతీయ జెండా ఎగరేశాం. మీరు ఒకప్పుడు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పుడు విమర్శించే నాయకులు ఎవరూ తిరగలేదు. గెలుస్తామో లేదో తెలియకుండానే తండాల్లో బోర్లు వేయించాం. ఎందుకంటే తెలంగాణ అంటే నాకు ఇష్టం.

తెలంగాణ విభజన తీరుకు నేను వ్యతిరేకం, తెలంగాణ విభజనకు కాదు. పార్లమెంట్ తలుపులు మూసి తెలంగాణ, ఆంధ్రాను విభజించిన తీరును తప్పు అని చెప్పాను. నాకు నిలబడింది కష్టాల్లో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వారాహికి అనుమతి ఇవ్వలేదు. తెలంగాణలో అనుమతి ఇచ్చారు. ఆంధ్రాలో అడుగు పెట్టనివ్వబోను అని నాడు వైసీపీ ప్రభుత్వం అంటే నాకు అండగా నిలబడింది తెలంగాణ యువత.

తెలంగాణలో అధికారం కోరుకోను, మార్పు తప్ప. సమస్యలపై పోరాడమని తెలంగాణ నాయకులకు చెప్పాను. తెలంగాణ ప్రజలకు ఆంధ్రాపై విద్వేషం లేదు. తెలంగాణ నాయకులందరికీ లేదు. నిజంగానే విద్వేషం చూపించి ఉంటే ఒక్క ఆంధ్ర వ్యక్తి ఇక్కడ ఉండేవారు కాదు. ఇది తెలంగాణ ప్రజల ప్రేమ. అలాంటిది హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడతావ్, ఇక్కడేం పని అని అడుగుతున్నారు. మీరెవరు నన్ను బెదిరించడానికి, మీ అయ్య జాగీరా తెలంగాణ? తెలంగాణ బెదిరింపుల కంటే ఆంధ్రాలో బెదిరింపులు ఎక్కువ. అక్కడ తల తీసేయమంటారు. నేను ఓడిపోయినప్పుడు తెలంగాణ నాయకులు ఒకటే చెప్పారు. ఇక్కడ అలాంటి పరిస్థితి



రానిచ్చేవాళ్లం కాదన్నారు. నా ఇంటి అడ్రెస్ చెప్పేందుకే ఇక్కడ ప్రెస్‌మీట్ పెట్టాను. ఎవరైనా దాడి చేసుకోవచ్చు. భయపడే వాడిని కాదు.

ఇప్పటి వరకు తెలంగాణ నాయకుడిని ఒక్కడిపై కూడా మాటల దాడి చేయలేదు. ప్రజలు కోరుకున్నప్పుడు వస్తాను. నాయకులకు అదే చెప్పాను. ముందు ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.


నా గుండెల్లో తెలంగాణ ఉంది. మీరెవరు నన్ను అడ్డుకోవడానికి, వైసీపీ గ్యాంగ్స్, క్రిమినల్స్ గ్యాంగ్స్ బెదిరించారు భయపడలేదు. ఇదంతా ఒక విశ్లేషకుడు చేసిన కామెంట్స్‌తో ఈ వివాదం మొదలైంది. ఆయన అమిత్‌షాతో నేను మాట్లాడినట్టు ప్రచారం చేశారు. దాన్ని తప్పుబడుతూ జనసైనికులు కేసులు పెట్టారు. దీంతో ప్రతి విషయానికి ఆంధ్రవాడే కారణమని ప్రచారం చేస్తున్నారు. అని పవన్ కళ్యాణ్ తెలంగాణలో తనను బెదిరిస్తున్న నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# నైరుతి రాక ఆలస్యం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

దేశంలో నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యం కానుంది. కేరళ తీరాన్ని తాకడంలో రుతుపవనాల కదలికలు మందగించడమే అందుకు కారణమని తెలుస్తోంది. భారత వాతావరణ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం జూన్ ప్రారంభంలోనే దేశంలోకి ప్రవేశించాల్సిన రుతుపవనాలు మరో 3 నుంచి 4 రోజులు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తాజాగా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జూన్ 5, 6 తేదీల్లో నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఈ నెల ఒకటో తేది నాటికే కేరళను తాకాల్సిన ఈ రుతుపవనాలు, ఈసారి కదలికలు మందగించడంతో ఆలస్యంగా రానున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న అసాధారణ వాతావరణ మార్పులు, వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ నైరుతి రుతుపవనాల రాకకు అడ్డంకిగా మారినట్లు నిపుణులు పేర్కొన్నారు. ఆ వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ ప్రభావం పూర్తిగా తొలగిపోతే గానీ రుతుపవనాల కదలికలు వేగవంతం కదలవని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు రుతుపవనాల రాక ఆలస్యం కానుండటంతో దేశంలోని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని రైతాంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. ఖరీఫ్ పనుల కోసం వర్షాలపైనే ఆధారపడే రైతులు.. ఆకాశం వైపునకు ఆశగా చూస్తున్నారు.




## తెలంగాణ నిరుద్యోగ యువతకు
# గుడ్ న్యూస్
## ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు!

**ముద్ర డెస్క్:**

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తయింది. జూన్ 2న ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ యువత, ముఖ్యంగా నిరుద్యోగులైన ఇంజినీర్లు, గ్రాడ్యుయేట్లు, విద్యా, పర్యావరణ, అటవీ శాఖల్లో ఉద్యోగాలు భర్తీ చేయాలని నిర్ణయించింది.

**ఆవిర్భావ వేడుకల్లో కీలక ప్రకటన..**

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు గుడ్ న్యూస్ చెప్పారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ద్వారా ఈ నెలలోనే ఇంజినీరింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, టౌన్ ప్లానింగ్, అటవీశాఖ, విద్యాశాఖల్లో పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

**నోటిఫికేషన్లు నిరంతరం జారీ..**

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ‘‘నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది’’ అని స్పష్టం చేశారు. ఒకేసారి ఒక్క నోటిఫికేషన్‌కు పరిమితం కాకుండా, వివిధ శాఖల్లో ఖాళీలు గుర్తించి వరుసగా నోటిఫికేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. ఇది యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించడంలో ముఖ్యమైన అడుగు.

**ఏ శాఖల్లో ఎలాంటి అవకాశాలు?**

ఇంజినీరింగ్ శాఖలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి విభాగాల్లో టెక్నికల్ పోస్టులు ఉన్నాయి. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో పర్యావరణ రక్షణ, కాలుష్య నియంత్రణకు సంబంధించిన సైంటిఫిక్, టెక్నికల్ పోస్టులు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్‌లో నగరాభివృద్ధి, అర్బన్ ప్లానింగ్ పోస్టులు ఉన్నాయి. ఇక అటవీశాఖలో అటవీ సంరక్షణ, వన్యప్రాణి సంరక్షణ, ఇకో–టూరిజం సంబంధిత పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యాశాఖలో ఉపాధ్యాయులు, లెక్చరర్లు వంటి విద్యా రంగ పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంది. తెలంగాణలో నిరుద్యోగం యువతను వేధిస్తున్న ప్రధాన సమస్య. డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన లక్షలాది మంది ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ ప్రకటనతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురింపజేసింది. ఉద్యోగాల భర్తీ ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెరిగి, రాష్ట్ర అభివృద్ధిలో వారి భాగస్వామ్యం పెరుగుతుంది.

# చమురు, గ్యాస్ కష్టాలు తీరినట్టే!

**ముద్ర డెస్క్:**

అమెరికా–ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా భారత్ ఇంధన రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు భారీగా పెరిగి, సరఫరా కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి ఊరట లభించింది.

**హోర్ముజ్‌కు ప్రత్యామ్నాయం..**

హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచంలోని అత్యధిక చమురు, గ్యాస్ రవాణా జరుగుతుంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల నౌకల రవాణాలో అంతరాయం ఏర్పడటంతో భారత్‌కు ఇంధన సరఫరా దెబ్బతిన్నది. దీని ప్రభావంతో పెట్రోల్, ఎల్‌పీజీ ధరలు పెరిగాయి. సరఫరా కొరత ఏర్పడింది. పానిక్ బయింగ్ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత్‌కు ప్రత్యామ్నాయ మార్గం అవసరమైంది.

**ఒమన్‌తో కీలక ఒప్పందం..**

భారత్–ఒమన్ మధ్య కుదిరిన కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్ (సీఈపీఏ) 2025, జూన్ నుంచి అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఒమన్‌లోని ప్రధాన పోర్టులు (సలాలా, దుక్మ్ వంటివి) ద్వారా భారత్‌కు చమురు, ఎల్‌ఎన్‌జీ, ఇతర ఇంధన ఉత్పత్తులు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతాయి. ఒమన్ తీర ప్రాంతం హోర్ముజ్ జలసంధికి వెలుపల ఉండటం ఈ ఒప్పందాన్ని వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనదిగా మార్చింది. ఇది భారత్‌కు సురక్షితమైన, నమ్మదగిన ఇంధన సరఫరా మార్గాన్ని అందిస్తోంది.

**భారత్‌కు చాలా కీలకం..**

ఒమన్‌తో ఒప్పందం కారణంగా హోర్ముజ్‌పై అత్యధిక ఆధారపడటం తగ్గుతుంది. పెట్రోల్, ఎల్‌పీజీ, డీజిల్ సరఫరా స్థిరంగా ఉంటుంది. ధరల పెరుగుదల నియంత్రణలో ఉంటుంది. ప్రజల ఆందోళన తగ్గి, సాధారణ సరఫరా పరిస్థితి ఏర్పడుతుంది.ఈ ఒప్పందం కేవలం తాత్కాలిక పరిష్కారం కాదు. దీర్ఘకాలికంగా భారత్ ఇంధన దిగుమతులను వైవిధ్యపరచడంలో, సప్లై చైన్‌ను బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలుస్తుంది. ప్రస్తుత భూరాజకీయ పరిస్థితులు ఏ సమయంలోనైనా హోర్ముజ్ జలసంధిని ప్రభావితం చేసే అవకాశం ఉంది. అలాంటి సమయంలో ఒమన్ లాంటి స్నేహపూర్వక దేశంతో బలమైన వాణిజ్య – ఇంధన భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం భారత్




దూరదృష్టి, వ్యూహాత్మక విజ్ఞతను చూపిస్తోంది. ఇది భారత్ ఇంధన భద్రతలో కొత్త అధ్యాయం

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 03.06.2026
www.mudranews.in | @mudranews



స్మార్ట్ స్టేషనరీ కొనుగోళ్లు



స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు, బుక్స్ వంటివి విడివిడిగా కాకుండా హోల్‌సేల్ దుకాణాల్లో లేదా ఆఫర్లు ఉన్నప్పుడు కొనుగోలు చేయడం మంచిది. దీనివల్ల స్టేషనరీ వ్యాపారుల డిమాండ్ సీజన్‌లో కూడా కొంతవరకు డబ్బు ఆదా అవుతుంది.

# 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష

**రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం**

**జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసిందని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. ఆ ఖైదీలు మంగళవారం జైళ్ల నుంచి విడుదలయ్యారని తెలిపారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలుబాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. మంగళవారం హైదరాబాద్ లో ఆమె మీడియాతో మాట్లాడారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి మంగళవారం నియామక పత్రాలు అందజేసినట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విడుదల పొందిన వారు బాధ్యతాయుతంగా జీవించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటే.. జైళ్ల శాఖ చేసిన కృషి ఫలించినట్లవుతుందని సౌమ్యా మిశ్రా పేర్కొన్నారు. గత ఏడాది కొత్త ప్రభుత్వం 213 మంది ఖైదీల విడుదలకు అనుమతి ఇవ్వగా, ఈసారి మరో 91 మందికి క్షమాభిక్ష మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రత్యేక జీవో జారీ చేసిన ప్రభుత్వం, అర్హులైన ఖైదీలకు ఏడాదిలో మూడు సార్లు క్షమాభిక్ష ఆధారంగా విడుదల అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు.

## బాపూజీని 'తెలంగాణ జాతిపిత'గా ప్రకటించాలి!

**వేముల సదానందం నేత డిమాండ్**



**ముద్ర, హన్మకొండ-హంటర్ రోడ్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి, మలి దశల ఉద్యమాలలో అలుపెరగని పోరాటం చేసిన దివంగత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని 'తెలంగాణ జాతిపిత'గా ప్రకటించాలని తెలంగాణ ఆన్లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఢీంబాయ్ టీవీ సీఈఓ,ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ వేముల సదానందం నేత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం'ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు' ప్రాంగణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ వేముల సదానందం నేత ముఖ్య అతిథిగా హాజరై మువ్వన్నెల జెండాను ఎగరవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం, ఇక్కడి ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహోన్నత వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయన చేసిన త్యాగాలకు, పోరాటాలకు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని అధికారికంగా 'తెలంగాణ జాతిపిత'గా ప్రకటించాలని ఆయన కోరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసి తుదిశ్వాస విడిచే వరకు ఉద్యమించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి మనం ఇచ్చే నిజమైన గౌరవం ఇదేనని వేముల సదానందం నేత పేర్కొన్నారు.అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని,భారత రత్న అవార్డు ప్రకటించాలని వేముల సదానందం నేత డిమాండ్ చేశారు. అంతకుముందు జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం. ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం తరతరాల చరిత కలిగిన తల్లీ నీరాజనం. పద పదాన నీ పిల్లలు తడవిల్లిన శుభ తరుణం! అనే తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేత వసతి గృహం ఇన్చార్జి అన్వేష్,విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు బస్సులు ఢీకొని ఏడుగురి మృతి



**ముద్ర , ఢిల్లీ :** గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సూరత్ జిల్లా బర్డోలీ ప్రాంతంలో రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా.. 40 మందికిపైగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం మహారాష్ట్రకు చెందిన బస్సు.. బర్డోలీ వద్ద ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న మరో ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు సూరత్ ఎస్పీ వెల్లడించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈ రెండు బస్సులూ మహారాష్ట్ర ఆర్టీసీకి చెందినవేనని పోలీసులు తెలిపారు. ఈ బస్సులు పరస్పరం ఢీకొట్టుకోవడంతో ఒక బస్సులో మంటలు చెలరేగాయన్నారు. ఈ బస్సుల్లో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు బర్డోలీ పోలీసులు వెల్లడించారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. సూరత్‌తో పాటు పక్కనే ఉన్న తాపి జిల్లా పోలీసులు సైతం ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపడుతున్నారని చెప్పారు.

# సీఎం రేవంత్ పాలమూరు పర్యటన చారిత్రాత్మక ఘట్టం

**ఉత్తమ్ ఉన్నత స్థాయి సన్నాహక సమావేశం**
**కొనసాగుతున్న, ప్రతిపాదిత ప్రాజెక్టులపై విస్తృత క్షేత్రస్థాయి సమీక్షకు ప్రణాళిక**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులను సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల పాటు తనిఖీ చేయనున్నారని, ఈ పర్యటన పాలమూరు ప్రాంతంలో భవిష్యత్ నీటి పారుదల అభివృద్ధి గమనాన్ని నిర్దేశించే ఒక చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. మంగళవారం జల సౌధలో సీనియర్ అధికారులతో జరిగిన ఉన్నత స్థాయి సన్నాహక సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈ పర్యటన ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి దిశా నిర్దేశం చేయవచ్చని, వాటి వేగ వంతమైన అమలుకు కొత్త నిధులు సమకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి లో ఉన్న, ప్రతిపాదిత నీటి పారుదల పనుల స్థితిని సమీక్షించడం, ఎదురయ్యే అడ్డంకులను అంచనా వేయడం, వాటిని త్వరగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలను గుర్తించడంపై సీఎం పర్యటన దృష్టి సారిస్తుందని ఆయన అన్నారు. ఈ తనిఖీ అనంతరం కరువు పీడిత పాలమూరు ప్రాంతంలో నీటి పారుదల సామర్థ్యాన్ని గరిష్ఠ స్థాయికి పెంచి, లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో చేపట్టిన కీలక నీటి పారుదల ప్రాజెక్టులకు ప్రధాన విధాన నిర్ణయాలు, మంజూరులు, భారీ నిధుల విడుదల జరిగే అవకాశం ఉందన్నారు. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా నీటి పారుదల స్వరూపాన్ని మార్చాలనే రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబించే ఈ ప్రతిపాదిత పర్యటనను ఒక చారిత్రాత్మక, అపూర్వమైన చర్యగా మంత్రి అభివర్ణించారు. ఈ పర్యటనలో సీఎం రేవంత్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు సీనియర్ మంత్రులు ఉండే అవకాశం ఉందని అన్నారు. ఈ సన్నాహక సమావేశానికి నీటి పారుదల శాఖ, ఇతర సంబంధిత శాఖల సీనియర్ అధికారులు ప్రత్యక్షంగా, వర్చువల్‌గా హాజరయ్యారు. రెండు రోజుల పర్యటనకు సంబంధించిన పర్యటన ప్రణాళిక, ప్రాజెక్టుల వారీగా ప్రజెంటేషన్లు, క్షేత్రస్థాయి తనిఖీలు, లాజిస్టికల్ ఏర్పాట్లపై జరిగిన సవివరమైన చర్చల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. పర్యటన సందర్భంగా సీఎం... కొనసాగుతున్న పనులు, మిగిలి ఉన్న పనులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై విస్తృతమైన క్షేత్రస్థాయి సమీక్ష చేపట్టేందుకు వీలుగా, ప్రాజెక్టుల తాజా పురోగతి నివేదికలను అందించాలని అధికారులను ఆదేశించారు. పాలమూరు ప్రాంతంలో ఆచరణ సాధ్యమైన అన్ని సాగునీటి ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేసి, ప్రతి ప్రాజెక్టు సాగునీటి విస్తరణకు సమర్థవంతంగా దోహదపడేలా చూడటానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, కోయిల్‌సాగర్, భీమా, నెట్టంపాడు, ఈ ప్రాంతంలోని ఇతర కీలక నీటి పారుదల పనులతో సహా ప్రధాన నీటి పారుదల ప్రాజెక్టులపై సవివరమైన ప్రజెంటేషన్లు ఇవ్వబడతాయి.

జూన్ 4న సాయంత్రం సోమశిలలో ఒక ప్రధాన ప్రజెంటేషన్ సెషన్‌ను ప్రతిపాదించారు, అక్కడ సీనియర్ ఇంజనీర్లు వివిధ ప్రాజెక్టుల స్థితి, సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై ముఖ్యమంత్రికి వివరించనున్నారు. ఈ సమీక్షా సమావేశంలో లాజిస్టిక్స్, వసతి, భద్రతా ఏర్పాట్లు, రవాణా, వైమానిక తనిఖీలపై కూడా చర్చించారు. ఈ పర్యటన కోసం రెండు హెలికాప్టర్లను వినియోగిస్తారు, సీఎం, డిప్యూటీ సీఎం ఈ ప్రాంత వ్యాప్తంగా నీటి పారుదల మౌలిక సదుపాయాలు, ప్రాజెక్ట్ సైట్‌లలో విస్తృతమైన వైమానిక సర్వేలను చేపట్టగలుగుతారు. నిధుల అవసరాలు, ప్రాజెక్టుల పూర్తి షెడ్యూళ్లు మరియు ఈ ప్రాంతంలో నీటి పారుదల అభివృద్ధిని వేగవంతం చేయడానికి అవసరమైన చర్యల గురించి రాష్ట్ర ప్రభుత్వం అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకోవడానికి ఈ పర్యటన సహాయపడుతుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.ఈ పర్యటన ఈ ప్రాంత భవిష్యత్ నీటిపారుదల రోడ్ మ్యాప్‌ను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, కార్యక్రమంలోని ప్రతి అంశం సజావుగా అమలు అయ్యేలా అన్ని శాఖలతో సమన్వయంతో పని చేయాలని మంత్రి ఆదేశించారు.

## ఎల్బీ స్టేడియంలో ఘనంగా 12వ రాష్ట్ర అవతరణ దినోత్సవం

**జెండాను ఆవిష్కరించిన చైర్మన్ శివసేనారెడ్డి**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ప్రధాన కార్యాలయం ఎల్బీ స్టేడియంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. చైర్మన్ శివసేనారెడ్డి ఏం డి డాక్టర్ సోనీ బాలాదేవితో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రజల సుదీర్ఘ ఆకాంక్షకు ఫలితమని సాధించుకున్న తెలంగాణలో స్వేచ్ఛ ఆత్మాభిమానం ముఖ్యమని అన్నారు. ఒక దశాబ్ద రాష్ట్రం ఏర్పడిన తర్వాత దశాబ్దకాలం పూర్తిగా విస్మరించబడిన క్రీడారంగం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రజాపాలనలో అన్ని రంగాల మాదిరిగానే తెలంగాణ క్రీడా రంగా అభివృద్ధికి విశేష కృషి జరుగుతుందని అన్నారు. రెండున్నర సంవత్సరాల్లోనే క్రీడారంగంలో సమూల మార్పును స్పష్టంగా సాధించుకోగలిగామని ఆయన తెలిపారు. తెలంగాణ క్రీడారంగం మరింత వేగవంతంగా అభివృద్ధి సాధిస్తూ అన్ని క్రీడాంశాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలబడాలి అని ఆకాంక్షించారు. ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజాస్వామిక స్ఫూర్తితో ఎలా సాధించుకున్నారో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కూడా అదే రకమైన స్ఫూర్తి కనబరచాలని తెలంగాణ క్రీడారంగం జాతీయ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించే ఆకర్షించాలని అభిలాషించారు. ముందుగా జనగణమన గీతాలాపన అనంతరం తెలంగాణ రాష్ట్ర గేయం ఆలపించడం జరిగింది ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు శ్రీమతి అనిత సుజాత, రవీందర్, శ్రీనివాస్ అశోక్ కుమార్ ఇంజనీర్ శ్రీనివాస్ అసిస్టెంట్ డైరెక్టర్లు కె.ఆర్ బట్టర్ అశ్విని దడ్పే, షాలిని , పి ఆర్ ఓ కాలేరు సురేష్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ రవికుమార్ కోచులు కార్యాలయ సిబ్బంది క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# పక్క రాష్ట్రాలతో గిల్లి కజ్జాలేంటి?

**- సీఎం రేవంత్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్**
**- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రధాన పాత్ర బీజేపీదే..**
**- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వేళ సంచలన వ్యాఖ్యలు**




**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రధాన పాత్ర బీజేపీదే అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మంగళవారం బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. బీజేపీ సహకారం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన కోసం బీజేపీ పోరాటం చేసిందన్నారు. కేసీఆర్ దొంగ దీక్షలు చేస్తే.. బీజేపీ గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడిందన్నారు. ఇప్పుడు రేవంత్ పాలన అంతా కలెక్షన్లు.. కమీషన్ల మీదే నడుస్తోందని ఆరోపించారు. రేవంత్ పాలనపై తెలంగాణ ప్రజలు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారని విమర్శించారు. పాలన చేతకాక.. కేంద్రాన్ని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రాన్ని విమర్శించడం, కేంద్ర మంత్రులను తిట్టడమే రేవంత్ పనా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా ప్రయత్నం చేస్తోందని తెలిపారు.

**నిధులు ఇచ్చే ప్రభుత్వానికి అధికారం**

అయితే, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఏ ప్రభుత్వం రావాల్సి ఉందని ప్రశ్నించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడితే తప్ప.. రాష్ట్రానికి సంబంధించిన రూ.8 లక్షల కోట్ల అప్పులు తీరవని, రాష్ట్రం అభివృద్ధి చెందని తేల్చి చెప్పారు. పక్క రాష్ట్రంలో అభివృద్ధి చెందుతుందనడానికి నిదర్శనం నరేంద్ర మోడీ ప్రభుత్వమన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతుందని, ఆ రాష్ట్రాల్లో నిధులు దారి మళ్ళించడం లేదని, వాపస్ కూడా పోవడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి పాలన నడుస్తోందన్నారు. అందుకే నిధులు ఇచ్చే ప్రభుత్వానికి అధికారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# తెలంగాణ సంస్కృతి, వారసత్వం గొప్పది







**- వికసిత్ భారత్ లో తెలంగాణ కీలకం**
**- రాష్ట్ర ఆవిష్కరణ పారిశ్రామిక స్ఫూర్తికి నిదర్శనం**
**- అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న ప్రధాని మోదీ**
**- రేవంత్, కేసీఆర్ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు**

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోడీ నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పవన్ కళ్యాణ్ వంటి ప్రముఖులు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాని మోదీ తన సందేశంలో వికసిత్ భారత్ నిర్మాణంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రం గొప్ప సంస్కృతి, వారసత్వానికి నిలయమని కొనియాడారు. తెలంగాణ ఆవిష్కరణలు, పారిశ్రామిక స్ఫూర్తికి నిదర్శనమని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.


ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. దశాబ్దాల పాటు కొనసాగిన వివక్ష, అణచివేతకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో సాగిన ఉద్యమ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా తమ ప్రభుత్వం పదేళ్ల పాటు పనిచేసిందని గుర్తు చేశారు. తెలంగాణ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 03.06.2026
www.mudranews.in | @mudranews



## వ్యవసాయ పెట్టుబడుల ముందస్తు ప్రణాళిక

రైతులు ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం ముందే బ్యాంకులు లేదా సహకార సంఘాల ద్వారా తక్కువ వడ్డీ రుణాలు సిద్ధం చేసుకోవాలి. చివరి నిమిషంలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోకుండా ఉండటానికి ఇది సహాయపడుతుంది.



# జపనీస్ వాకింగ్ తో ఎన్ని ప్రయోజనాలో తెలుసా?



**ముద్ర డెస్క్ :** మనలో చాలామందికి ఉదయం పూట వాకింగ్ చేసే అలవాటు ఉంటుంది. సిటీలో ఉన్నవాళ్లు గ్రౌండ్లలో.. మారుమూల గ్రామాలలో ఉన్నవారు పంట పొలాలు లేదా.. ఇతర ప్రాంతాలలో వాకింగ్ చేస్తూ ఉంటారు. వాకింగ్ చేయడం వల్ల శారీరక సామర్థ్యం పెరుగుతూ ఉంటుంది. అంతేకాదు చెమట రూపంలో చెడు పదార్థాలు బయటికి వెళ్లిపోతుంటాయి. శరీరం స్లిమ్ అవుతూ ఉంటుంది. పైగా నడక వల్ల వృద్ధాప్య ఛాయలు రావు. శరీరంలో ఉన్న అనవసరమైన కొవ్వులు కూడా కరిగిపోతాయి. అవయవాల పనితీరు మెరుగవుతుంది.

వాకింగ్ చేసేటప్పుడు చాలామంది ఒక రకమైన విధానాన్ని పాటిస్తూ ఉంటారు. అయితే వాకింగ్ లు కూడా రకరకాల పద్ధతులు అమల్లోకి వచ్చాయి. అయితే ఇప్పటి కాలంలో జపనీస్ వాకింగ్ స్టైల్ ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారి తీస్తోంది. జపాన్ ప్రజలు పొదుపు.. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉంటారు.

జపాన్ ప్రజలు ప్రతిరోజు పదివేల అడుగుల వరకు నడుస్తూ ఉంటారు. దీనివల్ల శారీరక శ్రమ ఏర్పడుతూ ఉంటుంది. ఇది అత్యంత సులువైన శారీరక శ్రమకు బెంచ్ మార్క్ గా ఉంటుంది.. ఫిట్నెస్ ట్రాకర్స్ .. స్మార్ట్ ఫోన్ల సహాయంతో జపాన్ ప్రజలు ప్రతిరోజు 10,000 అడుగులు నడుస్తుంటారు.

ఇలా వాకింగ్ చేయడం వల్ల డిమెన్షియా నుంచి శరీరానికి రక్షణ కలుగుతుందని జపాన్ ప్రజలు నమ్ముతుంటారు. అయితే ఆరోగ్యంగా ఉన్న వారికి పదివేల అడుగుల దూరం నడవడం పెద్ద కష్టం కాకపోవచ్చు కానీ.. మోకాళ్ల నొప్పులు.. కీళ్ల నొప్పులు ఉన్నవారికి ఇబ్బంది తప్పకపోవచ్చు.. నడక వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయని జపాన్ ప్రజలు నమ్ముతుంటారు.. కొద్దిసేపు వేగంగా నడిచి.. ఆ తర్వాత నెమ్మదిగా నడవడం వల్ల శ్వాస మెరుగ్గా ఉంటుంది. అవయవాల పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తప్రసరణ వ్యవస్థని కూడా సక్రమంగా చేస్తోంది. జపాన్ ప్రజలు టెక్నాలజీని ఎక్కువగా వాడుతూ ఉంటారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నెమ్మదిగా నడుస్తుంటారు. ఆఫీస్ కు వెళ్తున్నప్పుడు వేగంగా అడుగులు వేస్తుంటారు.

ఉదయం బ్రేక్ ఫాస్ట్ తీసుకున్న తర్వాత కూడా జపాన్ ప్రజలు నడుస్తుంటారు. దీనివల్ల శరీరంలో జీర్ణక్రియ మెరుగవుతుందని.. సరైన స్థాయిలో పోషకాలు అన్ని శరీర అవయవాలకు లభిస్తాయని జపాన్ ప్రజలు నమ్ముతుంటారు. జపాన్ ప్రజలు ఉదయం పూట 30 నిమిషాల పాటు వాకింగ్ చేస్తుంటారు. ఒకవేళ ఆరోగ్యం మెరుగ్గా ఉన్నవారు అంతకంటే ఎక్కువగానే చేస్తుంటారు. ఇందులో మొదటి మూడు నిమిషాలు వేగంగా నడుస్తుంటారు. ఆ తర్వాత మూడు నిమిషాలు నెమ్మదిగా నడుస్తుంటారు. ఇలా ఐదుసార్లు వేగంగా.. ఐదుసార్లు నెమ్మదిగా నడిచి.. ఆరోగ్యానికి కాపాడుకుంటారు. అయితే ఇలా నడిచే ముందు జపాన్ ప్రజలు వార్మప్ చేస్తుంటారు.

ఈ విధానం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని హార్వర్డ్ వైద్య నిపుణులు తమ పరిశోధన ద్వారా బయటపెట్టారు. రక్త ప్రసరణ వేగం దీనిద్వారా సమర్థవంతంగా జరుగుతుందని.. గుండెపోటు వచ్చే అవకాశం ఉండదని.. రోగ నిరోధక శక్తి పెరుగుతుందని.. రాత్రి సమయంలో నిద్ర మెరుగ్గా పడుతుందని హార్వర్డ్ వైద్యులు చెబుతున్నారు.

## పుష్కర తెలంగాణ ముష్కరుల పాలైంది

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్- లివింగ్ లెజెండ్ కేసీఆర్**
**2028 డిసెంబర్‌లో కేసీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల పాలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. లివింగ్ లెజెండ్ కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ వచ్చాక నోరుందని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో అమరవీరులకు ఆయన నివాళులర్పించి.. జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. నెత్తురు పారిన చోట సాగు నీళ్లు తీసుకువచ్చిన ఘనుడు కేసీఆర్ అన్నారు. లక్షా 65 వేల ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ అని.. అల్పకులు ఏది పడితే అది మాట్లాడతారని మండిపడ్డారు. ఎత్తిన జెండా దించనని.. జెండా దించితే రాళ్లతో కొట్టిచంపమని అన్న ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్' అని కేటీఆర్ చెప్పారు.

**దేశమంతా కాంగ్రెస్‌ను వదిలించుకుంది**

దేశమంతా కాంగ్రెస్‌ను వదిలించుకుందని కేటీఆర్ సెటైర్లు వేశారు. తెలంగాణను కాంగ్రెస్.. కుక్కలు చింపిన విస్తరిలా చేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులు.. అధికారుల కాళ్లు పట్టుకునే దుస్థితి వచ్చిందన్నారు. కృష్ణా, గోదావరిని గురువుకు గురుదక్షిణగా రేవంత్ ఇస్తున్నారని ఆరోపించారు. 'రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్ వచ్చి చెప్పిన 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ? సెక్యూరిటీ లేకుండా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బయటికి వస్తారా.? రైతుబంధు లేదు.. కానీ రాహుల్ గాంధీ బంధు టింగ్ టింగ్ అని వెళ్తోంది. తెలంగాణ తల్లి ఒడ్డాణం, కిరీటం ఎత్తుకుపోతున్నారు' అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## పవన్ కల్యాణ్ ఓ పెయిడ్ ఆర్టిస్ట్

**నా దగ్గర డబ్బులు ఉంటే పవన్‌తో ఒక క్యారెక్టర్ చేయిస్తా**
**రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** పవన్ కల్యాణ్ ఓ పెయిడ్ ఆర్టిస్ట్ అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. తన దగ్గర డబ్బులు ఉంటే తాను కూడా పవన్‌తో ఒక క్యారెక్టర్ చేయిస్తానని చెప్పారు. తెలంగాణపై పవన్ కల్యాణ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారంటూ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్ వేదికగా స్పందించారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తి పవన్ కల్యాణ్ అన్నారు. గద్దర్‌కు కారు కొనిచ్చా అని చెప్పినందుకు ముందు క్షమాపణ చెప్పాలంటూ పవన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. చనిపోయిన వారి గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటి? అని ఏపీ డిప్యూటీ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. తనకు ఆంధ్రాలోనే దిక్కు లేదని పవన్ చెప్పుకున్నాడని వ్యంగ్యంగా అన్నారు. ఉద్యమ సమయంలో కూడా ఆంధ్రా వాళ్ళని తాము ఏమీ అనలేదని పేర్కొన్నారు. తాము ఆంధ్రా వాళ్ళని ఏదో అన్నట్టు పవన్ కల్యాణ్ అబద్ధాలు చెబుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.సినిమా నటుడిగా పవన్ ఎక్కడ తిరిగినా తమకేం ఇబ్బంది లేదన్నారు. పార్లమెంటులో ఏ బిల్లు చేసినా తలుపులు మూసే పాస్ చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కొండగట్టుకు ఇచ్చిన పైసలు మీ అయ్యా జాగీరా? అని సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీటింగ్ పెట్టడం గెలకడం కాదా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ తిరిగితే జనాలు వస్తారు కానీ ఓట్లు వేయరని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ వచ్చినా, పోయినా మాకేం సంబంధం లేదన్నారు. తెలంగాణ ఎప్పుడైనా ఏపీ ప్రజలను స్వాగతిస్తూనే ఉంటుందని చెప్పారు.

## పవన్ ప్రెస్ మీట్లతో మీకెందుకూ జంకు ?


**మెదక్ ఎంపీ రఘునందన్ రావు - రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రెస్ మీట్లు పెట్టలేరా ?**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** ఏపి డిప్యూటీ సీఎం తెలంగాణలో ప్రెస్‌మీట్ పెడితే.. కాంగ్రెస్ నేతలకు, సీఎం రేవంత్ రెడ్డికు వచ్చిన అభ్యంతరం ఏంటో చెప్పాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రెండున్నరేళ్లుగా తెలంగాణ సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి వందలసార్లు ఢిల్లీకి వెళ్లి అక్కడ ప్రెస్‌మీట్ పెట్టడం లేదా అని నిలదీశారు. పక్క రాష్ట్రం వాళ్లు తెలంగాణలో ప్రెస్‌మీట్‌లు పెట్టొద్దా? అని సెటైర్లు వేశారు. గతంలో కేసీఆర్ కూడా పక్క రాష్ట్రం ఏపీలో సభలు పెట్టారని.. నేడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లో హైదరాబాద్‌లో సభ పెడితే కాంగ్రెస్ నేతలు ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ఫైర్ అయ్యారు. ఎవరి ఉనికి ఎవరికీ ప్రమాదం కాదని.. ఎట్టకేలకు ప్రజలకు ఆశీర్వదించిన వాళ్లే అధికారంలోకి వస్తారని ఎంపీ రఘునందర్ రావు స్పష్టం చేశారు.

## రష్యా చేరుకున్న ఏపీ మంత్రి నారా లోకేష్

**పెట్టుబడుల కోసం రష్యా పర్యటనకు వెళ్లిన మంత్రి నారా లోకేష్**



**ముద్ర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనకు వెళ్లారు. ఆరు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం రష్యా రాజధాని మాస్కో చేరుకున్నారు. మాస్కో విమానాశ్రయంలో లోకేష్‌కు భారత రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ నిఖిలేశ్ గిరి, స్థానిక ఆంధ్ర ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. ఆయన జూన్ 7 వరకు రష్యాలోనే పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా ఆయన సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగే అంతర్జాతీయ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొననున్నారు. ఇది రష్యాలో జరిగే కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య, పెట్టుబడుల సదస్సు. ఈ వేదికపై లోకేష్ ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించనున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విదేశీ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడమే లక్ష్యంగా చేపడుతున్న చర్యల్లో ఈ పర్యటన ఒక భాగమని తెలుస్తోంది. పర్యటనకు సంబంధించిన మరిన్ని వివరాలు సదస్సు జరుగుతున్న కొద్దీ వెల్లడయ్యే అవకాశం ఉంది.

## లాటరైట్ గనులపై కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

**ముద్ర, అమరావతి:** లాటరైట్ ఖనిజం వర్గీకరణలో కేంద్రప్రభుత్వం చేసిన మార్పుల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో గనుల లీజుల ప్రక్రియ నిలిచిపోయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. లాటరైట్‌లో 20 శాతం లేదా అంతకంటే ఎక్కువ అల్యూమినియం ఉంటే దానిని మైనర్ మినరల్‌గా కాకుండా బాక్సైట్‌గా పరిగణించాలని కేంద్రం ఇటీవల నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మార్పుల కారణంగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 402 గనుల లీజు దరఖాస్తులను తాత్కాలికంగా నిలిపి వేయాల్సి వచ్చిందని సీఎం వివరించారు. పాత నిబంధనల ఆధారంగా దరఖాస్తు దారులు ఇప్పటికే కోట్ల రూపాయలు ఖర్చు చేశారని పేర్కొన్నారు. గతంలో కొన్ని ఖనిజాల వర్గీకరణ మార్పుల సమయంలో కేంద్రం ఇచ్చినట్లే లాటరైట్ విషయంలో కూడా "సేవింగ్ క్లాజ్" అమలు చేసి, పెండింగ్ దరఖాస్తులను పాత నిబంధనల ప్రకారమే మరో రెండేళ్లు ప్రాసెస్ చేసేందుకు అనుమతించాలని కోరారు. దీంతో పెట్టుబడిదారులకు ఆర్థిక నష్టం తప్పడమే కాకుండా కోర్టు వివాదాలు కూడా నివారించవచ్చని సీఎం లేఖలో తెలిపారు.

## మోదీ రాసిస్తే పవన్ చదివినట్టుంది..

**- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి**

**ముద్ర, హైదరాబాద్:** ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి తీవ్ర స్థాయిలో స్పందించారు. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితంగా ఉన్నాయని, బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న నాయకుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. కాంగ్రెస్, జనసేన పార్టీలు కలిసి రాజకీయ నాటకాలకు తెరలేపుతున్నాయని జగదీశ్ రెడ్డి. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ తరహా కార్యక్రమాలు జరుగుతున్నాయని. రాజకీయంగా మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని డ్రామాలు ఆడుతున్నారు.ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై కూడా వ్యాఖ్యలు చేసిన జగదీశ్ రెడ్డి, "మోదీ రాసిచ్చారు.. పవన్ కల్యాణ్ చదివారు" అంటూ ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ స్వతంత్ర రాజకీయ వైఖరితో కాకుండా బీజేపీ అజెండాను అమలు చేయడానికి కనిపిస్తుంది. ప్రజల సమస్యలపై దృష్టి సారించకుండా రాజకీయ విమర్శలతో కాలక్షేపం చేయడం సరికాదని, జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు.

# ఎస్ఐఆర్ పై అప్రమత్తం కావాలి

**ప్రతి అర్హుడి ఓటు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన**
**ఎస్ఐఆర్ ప్ర క్రియలో టీడీపీతో పాటు ఎన్డీఏ మిత్రపక్షాల సమన్వయం కీలకమని వ్యాఖ్య**
**జూన్ 25 నుంచి 45 రోజుల పాటు సైకిల్ యాత్రతో ఇంటింటి ప్రచారం**
**ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**
**వైసీపీపై అప్రమత్తంగా ఉండాలని, నాయకులు ప్రజల విశ్వాసం నిలబెట్టుకోవాలని సూచన**



**ముద్ర, అమరావతి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై పార్టీ నేతలు, కార్యకర్తలు పూర్తి అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆయన, ప్రతి అర్హుడి ఓటు నమోదు కావాలని, ఓటర్ల జాబితాపై నిరంతర పర్యవేక్షణ అవసరమని చెప్పారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని, ఇందుకోసం ప్రత్యేక కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు సైకిళ్లపై ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రభుత్వ రెండేళ్ల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

వైసీపీపై అప్రమత్తంగా ఉండాలని, డీఎస్సీ, నంద్యాల ఘటనల్లో తప్పుడు ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టామని అన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లో విశ్వాసం పెంచుకొని ఒకే సారి గెలిచే నాయకులుగా కాకుండా పదేపదే విజయం సాధించేలా పని చేయాలని చంద్రబాబు సూచించారు.

# గ్రామ, వార్డు సభలు విజయవంతం చేయాలి

**- ఈ నెల 4,6,9,10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా సభలు**
**- ఎస్ఐఆర్, పంట మార్పిడి, పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన కల్పించాలి**
**- జిల్లా కలెక్టర్లకు సీఎస్ దిశానిర్దేశం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఈనెల 4,6,9,10 తేదీల్లో గ్రామ,వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎస్ఐఆర్, రైతుల పంట మార్పిడి, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' ఏర్పాట్లతో పాటు, పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా చేపట్టాల్సిన పర్యావరణ అవగాహన కార్యక్రమాలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామ, వార్డు సభల్లో భాగంగా భారత ఎన్నికల సంఘం (ఈసి) ఆదేశాల ప్రకారం చేపడుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా (ఎస్ ఐ ఆర్) పై అవగాహన కల్పించడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఓటర్ల జాబితా అప్ డేట్ కార్యక్రమం ప్రాముఖ్యత గురించి పౌరులకు తగిన సమాచారం అందేలా చూడాలని ఆయన జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. రైతులు స్థిరమైన, లాభదాయకమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా వీలు కల్పించే 'పంటల మార్పిడి' గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి గ్రామసభలు, వార్డు సభలను ఉపయోగించుకోవాలని రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. వర్షాకాలానికి ముందు, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన 'రుతుపవనాల సన్నద్ధత' చర్యలపై కూడా అవగాహన కల్పించాలన్నారు.



**చురుగ్గా పాల్గొనేలా చూడాలి:**

గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా నివారించడంపై అధికారులు దృష్టి సారించాలని, అలాగే మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాల పై అవగాహన కల్పించాలని, పరిశుభ్రత, పర్యావరణ స్థిరత్వాన్ని కాపాడటంలో సమాజం చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించాలని ఆయన కోరారు. సామాజిక భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ.. ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సామాజిక నాయకులు, ఇతరులను గ్రామసభలు, వార్డు సభల నిర్వహణలో చురుగ్గా భాగస్వాములను చేయాలని సీఎస్ కలెక్టర్లను ఆదేశించారు. తద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అవగాహన ప్రచారాలు ప్రతి ఇంటికీ చేరుతాయని పేర్కొన్నారు.

వర్షాకాల సామగ్రి ముందస్తు కొనుగోలు
గొడుగులు, రెయిన్‌కోట్లు, వాటర్‌ప్రూఫ్ ఫుట్‌వేర్ వంటి వస్తువులను వర్షాలు పడకముందే కొని ఉంచుకోవడం లాభదాయకం. సీజన్ పీక్‌లో ఉన్నప్పుడు వ్యాపారులు పెంచే అదనపు ధరల భారం నుండి ఇది మిమ్మల్ని కాపాడుతుంది.


## రాష్ట్ర గవర్నర్‌ను కలిసిన ఎంపీ ఈటల రాజేందర్



**ముద్ర, మల్కాజిగిరి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవర్మ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలను గవర్నర్‌కు తెలియజేసిన ఎంపీ ఈటల రాజేందర్, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సమకాలీన అంశాలపై చర్చించినట్లు సమాచారం.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## అడ్వకేట్ రక్షణ చట్టం జీవో విడుదలపై హర్షం



**ముద్ర, వనపర్తి :** ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న న్యాయవాదుల రక్షణ చట్టం జీవో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం విడుదల అయిందని వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్ తెలిపారు, మంగళవారం బార్ అసోసియేషన్ కార్యాలయం లో అయన మాట్లాడారు, కార్యక్రమం లో న్యాయవాదులు తిరుపతయ్య గౌడ్, శశిభూషన్, షాకీర్ హుస్సేన్, వేంకటాద్రి, త్రినాథ్, శ్రీనివాస్ గౌడ్, చందర్ నాయక్, రఘువంశీ, కరుణాకర్, భరణి నాథ్, రాముడు, రాహుల్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు,

## బెల్ట్ షాప్ నిర్వాహకులపై కఠిన చర్యలు



**ముద్ర, శేరిలింగంపల్లి :** మహిళ సోదరీమణుల విజ్ఞప్తి మేరకు అర్ధరాత్రి స్వయంగా వెళ్లి బెల్ట్ షాపు నిర్వాహకులను పట్టుకున్న పీయేసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.'బెల్ట్ షాప్ ల తో ప్రజల జీవితాలతో చెలగాటం ఆడే వారు ఎంతటి వారు అయిన వదిలి పెట్టె ప్రసక్తే లేదు, చట్టపరమైన ,కఠిన చర్యలు తీసుకుంటాం. అని హెచరించారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీ లో విచ్చలవిడిగా బెల్ట్ షాప్ లు ఓపెన్ చేసి నకిలీ మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు .కాలనీ లలో ప్రశాంత వాతావరణం చెడగొడుతున్నారు అని స్థానిక మహిళలు చైర్మన్ ఆరెకపూడి గాంధీ గారికి విన్నవించుకోగా వెంటనే స్పందించి స్వయంగా అర్ధరాత్రి వెళ్లి బెల్ట్ షాప్ ల నిర్వాహకులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ రమేష్ నాయుడు ఎస్. ఐ కృష్ణయ్య, ఎక్సైజ్ సిబ్బంది మరియు మహిళలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కాంట్రాక్టర్ల డిమాండ్లను అంగీకరించం

### బిల్డర్ల అసోసియేషన్ తీర్మానం



**ముద్ర, కుషాయిగూడ:** సెంట్రింగ్ కాంట్రాక్టర్లు చేస్తున్న డిమాండ్లను తాము అంగీకరించమని పలువురు ఇంటి నిర్మాణ బిల్డర్లు పేర్కొన్నారు. మంగళవారం పద్మశాలి టౌన్షిప్ లో కాప్రా, దమ్మెగూడ, నాగారం, కీసర రాంపల్లి ప్రాంతాల బిల్డర్లు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బిల్డర్లు మాట్లాడుతూ... సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఏకపక్ష నిర్ణయాలతో సెంట్రింగ్ పనుల రేట్లు పెంచడం సరికాదన్నారు. భవన నిర్మాణాలు చేపడుతున్న తాము ఎంతో కష్టనష్టాలకు ఓర్చుతూ బతుకు బండిని సాగిస్తున్నామని, ఇలాంటి తరుణంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు రేట్లను పెంచాలని పనులను నిలిపి వేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా ధమ్మాయిగూడ నాగారం కీసర రాంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది బిల్డర్లు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ తాండూర్ కన్వీనర్‌గా కర్ణం పురుషోత్తంరావు



**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ లో భాగంగా భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న అత్యంత కీలకమైన ముందస్తు ప్రక్రియే వోటర్ మ్యాపింగ్ గతంలో 2002–2004 మధ్య జరిగిన చివరి ఎస్ ఐ ఆర్ రికార్డులను ప్రస్తుత ఓటర్ల జాబితాతో పోల్చి పరిశీలిస్తూ, ప్రతి ఓటరును వారి పాత రికార్డులు లేదా కుటుంబ మూలాలతో అనుసంధానించడం ఈ మ్యాపింగ్ యొక్క ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు.ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే తాండూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల పోలింగ్ బూత్‌లకు (269 పోలింగ్ బూత్స్) పార్టీ తరపున బీ ఎల్ ఏ లను నియమించినట్లు పేర్కొన్నారు. వారికి అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ, పార్టీ పరంగా SIR ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా పర్యవేక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది కర్ణం పురుషోత్తం రావును తాండూర్ నియోజకవర్గ కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో చైర్పర్సన్ పట్లోళ్ల నీరజ, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, పార్టీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

## సమసమాజ స్థాపనే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం

**ముద్ర, కూకట్ పల్లి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమసమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పోరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని బోయినపల్లి, బాలానగర్, మూసాపేట, అల్లాపూర్‌లలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ పతాకాలను ఎగురవేశారు. స్వయం సహాయక గ్రూపుల ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో వారికి పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు, బస్సుల కేటాయింపులు చేస్తున్నాం. ప్రజా పాలనలో ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మిస్తున్నాం. సన్న బియ్యం పంపిణీ ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాం.రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు పంటకు బోనస్ కూడా అందజేశాం.విదేశీ పెట్టుబడులు తీసుకు రావడం ద్వారా యువతకు పెద్దపీట వేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం అని తెలిపారు . నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, మార్కెట్ , టెంపుల్ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ, మైనారిటీ, ఎస్సీ, బీసీ సెల్స్ పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**- జాతీయ పతాకాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు.**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం మహబూబ్ నగర్ కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి ని వివరించారు.ఈ వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కలెక్టర్ కుష్బూ గుప్తా, ఎస్ పి జానకి, డి.ఎఫ్.ఓ శివ్ ఆశిష్ సింగ్,మేయర్ జి.మమత,డిప్యూట్ మేయర్ సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్



లక్ష్మణ్ యాదవ్, అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, హరిప్రియ,డి.ఆర్.ఓ నిర్మల,, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ అమర వీరుల కుటుంబాలను మంత్రి సన్మానించారు.జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ప్రదర్శించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయం, ప్రజా పాలన స్టాల్, వైద్యారోగ్య శాఖ, వ్యవసాయ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ,పోలీస్ శాఖ,సైబర్ సెక్యూరిటీ స్టాళ్లను ఏర్పాటు చేశారు.ఇందు లో ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయం చే ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాలమూరు,గండీడ్ మండల మహిళా సమాఖ్యలకు ఐదు ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుటకు రూ.2.46 కోట్ల చెక్కును మంత్రి జూపల్లి అంద చేశారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఎ.పి.జితేందర్ రెడ్డి**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** తెలంగాణ రైజింగ్–2047 విజన్‌తో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఎ.పి. జితేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. జోగులాంబ గద్వాల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఎ.పి. జితేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్–2047 విజన్‌లో పేదల సంక్షేమం, సమగ్ర విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, పారదర్శక సుపరిపాలనకు ప్రాధాన్యం



ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని పేర్కొన్నారు.జిల్లాలో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం ద్వారా 3 కోట్లకు పైగా ప్రయాణాలకు లబ్ధి చేకూరగా, ఆరోగ్యశ్రీ కింద 16,391 మందికి రూ.46.32 కోట్ల విలువైన వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. రైతు రుణమాఫీ కింద 58,113 మంది రైతులకు రూ.513.99 కోట్లు, రైతు భరోసా కింద 1.74 లక్షల మంది రైతులకు రూ.157.17 కోట్లు అందించామని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాకు 6,899 ఇళ్లు మంజూరు కాగా, 649 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. రూ.500 గ్యాస్ పథకం, గృహజ్యోతి, చేయూత పెన్షన్లు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ ద్వారా వేలాది కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాల కోసం జాబ్ మేళాలు, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని ప్రశంసాపత్రాలతో సత్కరించగా, 172 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.18.38 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం అమర వీరుల స్మారక స్థూపం, తెలంగాణ ఉద్యమ అమరవీరుల విగ్రహాలకు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లా అన్ని రంగాల్లో అగ్రగామిగా రాణిస్తుంది

**ఘనంగా ఆవిర్భావ దినోత్సవం**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అంతకుముందు అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి తెలంగాణ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా ఏర్పడిందని, ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు.ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, మహాలక్ష్మి , గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ వంటి పథకాల ద్వారా జిల్లాలో లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు.వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత రంగాల్లో జిల్లా విశేష పురోగతి సాధిస్తోందన్నారు. కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి, మార్కండేయ ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటి విస్తరణ జరుగుతోందని, ఈ నెల 5న ముఖ్యమంత్రి జిల్లాను సందర్శించి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించనున్నట్లు వెల్లడించారు.వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం వివిధ శాఖల ప్రదర్శన స్టాళ్లను సందర్శించి సంక్షేమ, అభివృద్ధి

కార్యక్రమాల అమలుపై అధికారులు వివరాలు





అందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అదనపు కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## వికలాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కూచుకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికలాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి లబ్ధిదారులకు ట్రైసైకిళ్లను అందజేసి వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం కోసం కూచుకుళ్ల ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. వికలాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కా రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించగా, భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సంపద సకలజనుల సంక్షేమానికే

**చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి**

**ముద్ర, వనపర్తి :** రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా ప్రజలందరికీ చేరేలా పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వనపర్తి ఐడీఓసీ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తోందని తెలిపారు. ఆరు గ్యారెంటీల అమలుతో మహిళలు, రైతులు, పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 3.48 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించగా, రూ.500 గ్యాస్ పథకం ద్వారా 85 వేల మందికి లబ్ధి చేకూరిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో 5,970 ఇళ్లు మంజూరు కాగా, 1,063 ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు.



గృహజ్యోతి ద్వారా 84,906 కుటుంబాలు, రైతు భరోసా ద్వారా 1.83 లక్షల మంది రైతులు, రైతు రుణమాఫీ ద్వారా 61,687 మంది రైతులు లబ్ధి పొందినట్లు వివరించారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 10,536 మందికి రూ.32.14 కోట్ల విలువైన వైద్య సేవలు అందించగా, చేయూత పథకం ద్వారా 70,304 మందికి ప్రతి నెలా పెన్షన్లు అందిస్తున్నామన్నారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, వ్యవసాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సీసీటీవీ నిఘా, సైబర్ క్రైమ్ విభాగం, షీ టీమ్స్ ద్వారా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనది



**ముద్ర, నారాయణ పేట :** సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జర్నలిస్టులు ముందుండి పోరాడి రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం చెందిన జర్నలిస్టులకు మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి తన సొంత డబ్బులతో ప్రమాద బీమా, ఆరోగ్య భీమా ను చేయించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను తన చేతుల మీదుగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తానే ఇన్సూరెన్స్ చేయిస్తానని హామీ ఇచ్చారు.ఆయన కృషిని జిల్లా అధ్యక్షులు కోయిలకొండ నారాయణరెడ్డి గుర్తు చేసి మాట్లాడారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మొసటి జ్యోతి, మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు భరత్, కాకర్ల నారాయణమ్మ, కే సుదర్శన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వేపూరి రాములు, విజయ సాగర్, ఫిరోజ్ పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర, కాప్రా:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా, ఉప్పల్ మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రజలు ఉల్లాసంగా ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు.

**మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో**

**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 03.06.2026
www.mudranews.in | @mudranews



### ఇంటి ముందస్తు మరమ్మతులు

వర్షాకాలం ప్రారంభం కాకముందే ఇంటి పైకప్పు లీకేజీలు, డ్రైనేజీ వ్యవస్థల మరమ్మతులు పూర్తి చేసుకోవాలి. వర్షాలు పడ్డాక సమస్య పెద్దదైతే సిమెంట్, ప్లంబింగ్ పనులకు ఖర్చు మరియు శ్రమ రెండూ రెట్టింపు అవుతాయి.



# అభివృద్ధిలో ఆదర్శం కరీంనగర్ జిల్లా

- సమగ్ర అభివృద్ధి ప్రధాన లక్ష్యం..
- అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ
- అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా రాష్ట్రం..
- కరీంనగర్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి




**ముద్ర, కరీంనగర్:**
అభివృద్ధిలో కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధులు ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధులు ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగా ఏర్పడిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తెలంగాణను ప్రపంచ స్థాయి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్-2047" దిశానిర్దేశక పత్రాన్ని రూపొందించిందని తెలిపారు.

జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక ద్వారా జిల్లాలో 3,506 ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు 2,913 పెండింగ్ ఫైళ్లను పరిష్కరించినట్లు తెలిపారు. మెగా జాబ్ మేళాలో 78 కంపెనీలు పాల్గొని 292 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాయని వెల్లడించారు.

మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో మహిళలు 7.39 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు చేయగా, రూ.334 కోట్ల ప్రయోజనం పొందారని మంత్రి తెలిపారు. అలాగే 1.58 లక్షల మంది లబ్ధిదారులకు రూ.500కే గ్యాస్ సిలిండర్లు అందించామని చెప్పారు. గృహజ్యోతి పథకం ద్వారా 1.73 లక్షల మందికి పైగా వినియోగదారులకు రూ.153 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు.

రైతుభరోసా పథకం కింద 1.93 లక్షల మంది రైతులకు రూ.143.35 కోట్లు జమ చేయగా, రైతు బీమా ద్వారా 267 మంది రైతుల కుటుంబాలకు రూ.13.35 కోట్ల పరిహారం అందించామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 10,114 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వేలాది ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత రంగాల్లో ప్రభుత్వం విశేష ఫలితాలు సాధించిందని మంత్రి పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ పరీక్షల్లో జిల్లా 98.57 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 52 వేల మందికి పైగా ఉచిత వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. మహిళా సంఘాలకు వందల కోట్ల రూపాయల రుణాలు అందించడంతో పాటు వేలాది కుటుంబాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించామని చెప్పారు.

కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వివిధ శాఖల స్టాళ్లను పరిశీలించిన మంత్రి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బందిని సన్మానించారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

- ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
పోరాడి సాధించిన తెలంగాణలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం పునరుద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వేడుకలలో భాగంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా నిర్మల్ జిల్లా అద్భుత ప్రగతి సాధిస్తుందని వివరించారు. పేదలకు ఎన్నో రకాల పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా మరింత అభివృద్ధి సాధించేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. మహిళా సంఘాలకు మంజూరైన రూ.74.93 కోట్ల చెక్కును, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కమిషన్ కు సంబంధించి రూ.3.94 కోట్ల చెక్కును అందించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీలు సాయికిరణ్, ఉపేంద్ర రెడ్డి, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



**ముద్ర, కోరుట్ల:** కోటి మంది మహి ళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల పట్టణ 13వ వార్డుకు చెందిన మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం కల్లూరు రోడ్డులో గల గడి స్కూల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావులతో కలిసి చీరల పంపిణిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ఇందిరమ్మ క్యాంటీన్, ఇందిరమ్మ హౌసింగ్, మహిళా శక్తి బృందాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల కోసం పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అవసరమైన భూమిని అధికారులు పరిశీలి స్తున్నట్లు తెలిపారు. గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేలా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం చూస్తుందన్నారు. ఇందిరా క్రాంతి మహిళా సంఘాల కార్యకలాపాల నిర్వహణ కోసం ప్రత్యేక భవన నిర్మాణాలు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం త్వరలో చేపట్టబోతుందన్నారు. మహిళల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, మహిళలు ఆర్థిక సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మహిళా సాధికారిక దోహదపడే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కమిషనర్ శ్రీనివాసరావు, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర, మహాదేవపూర్:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహాదేవపూర్ మండల అధ్యక్షులు ఎండి అక్రముద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా తెలంగాణ సీనియర్ ఉద్యమకారుడు అన్కారి ప్రభాకర్ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ఎండి అక్ర ముద్ది న్ ను శాలువాతో సన్మానించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షునిగా తనకు ఉద్యమకారుల బాధ్యతను అప్పగించిన సహచర ఉద్యమకారులకు అందరికీ అక్రముద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్, రాష్ట్ర ఫోరం నాయకుడు అయ్యుబోద్దీన్, జాడిగట్టయ్య కేదారి ప్రవీణ్ కుమార్, కొత్త పోచం, జాగృతి మహేష్, మెరుగు లక్ష్మణ్, కారెంగుల బాబురావు తదితరులు పాల్గొన్నారు. మహదేవపూర్ కమాన్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి పూర్ణ సమర్పించి నివాళులు అర్పించారు. సీనియర్ ఉద్యమకారుడు ఆన్కారి ప్రభాకర్, ఎండి గౌస్ ఖాన్, కలికోట దేవేందర్, జాడిగట్టయ్య, కేదారి ప్రవీణ్ కుమార్, కన్నెబోయిన ఐలయ్య పాల్గొన్నారు.



## ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



**ముద్ర, బోథ్:**
ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉం టుందని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిడుగు అశోక్ రెడ్డి అన్నారు. బోథ్ మండలం కౌట –బి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన అంజరి కోమలి, జె.శృతిక లు బాసర ట్రిబుల్.ఐటికి ఎంపికయ్యారు. కాగా వీరిని మంగళవారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కౌట (బి)లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పిడుగు అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఇక నుండి గ్రామాభివృద్ధి కమిటీ తరపున పదవ తరగతిలో మార్కులు సాధించిన విద్యార్థులను ప్రైజ్ మనీ అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని అన్నారు. తల్లిదండ్రులకు,తమ గ్రామానికి, గురువులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు .ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి ,ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, నవనీత్ రెడ్డి సుదర్శన్ గౌడ్, వి.డి.సి.ఉపాధ్యక్షులు రాజ బాబు, రైటర్ సాయన్న, చంద్రమోహన్ చిన్నయ్యలు, మాజీ ఉపసర్పంచ్ చిలకాడి రవీందర్ పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**ముద్ర, కోరుట్ల;**
జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం వెల్లుల్ల శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం రోజు దేవాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. వివిధ సేవలకు సంబంధించి టికెట్స్ ద్వారా వచ్చిన ఆదాయము 82 వేల150 రూపాయలు, అలాగే అమ్మవారి హుండీలు విప్పి లెక్కించగా 16 వేల 980 రూపాయల ఆదాయం సమకూరింది. ఈ లెక్కింపు కార్యక్ర మంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు ఎం. రాజా మొగిలి, వివిధ ఆలయాల దేవాదాయ శాఖ డిప్యూటేషన్ స్టాఫ్ కల్వకుంట్ల అనిల్ రావు, కూకట్ల రాజేందర్, గుంటుక శివ కేశవ్, మృత లహరి పాల్గొన్నారు.

# సంక్షోభం నుంచి సంక్షేమం

- ప్రభుత్వ విప్ శ్రీనివాస్ రెడ్డి



**మహాదేవపూర్, ముద్ర:**
ప్రజలు ఇచ్చిన శక్తి, సామర్థ్యాలతో ప్రజా ప్రభుత్వం సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం వైపు.. విధ్వంసం నుండి వికాసం వైపు తీసుకెళ్తున్నామని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్థూపం వద్ద అమరవీరులకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కాబట్టి భూ సమస్యల కు శాశ్వత పరిష్కారం కోసం ధరణిని రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెలంగాణ భూ భారతి చట్టం 2025ను తెచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వం మొదటి విడతలో జిల్లాకు 4,434 ఇండ్లు మంజూరు చేయగా, 547 ఇండ్లు నిర్మాణం పూర్తి కాగా 3,887 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని 29,683 మంది రైతులకు 299 కోట్ల 35 లక్షల రూపాయలు రుణమాఫీ చేశామని,రైతుకు మద్దతు ధరను ఇవ్వడంతో పాటు ప్రోత్సాహకంగా సన్నవడ్లకు క్వింటాకు 500 రూపాయలు బోనస్ అందచేస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీన కాటారం మండలం నస్తూర్ పల్లిలో నిర్వహించిన రైతు భరోసా బహిరంగ సభలో రాష్ట్ర వ్యాప్తంగా 36,76,766 ఎకరాలకు సంబంధించిన 45,11,947 మంది రైతులకు 2,206.06 కోట్ల రూపాయలు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మన జిల్లా నుండి రైతు భరోసా నిధులు విడుదల చేయడం మన జిల్లాకు లభించిన గౌరవమని తెలిపారు. ఈ పథకం ద్వారా మన జిల్లాలోని 1,17,950 మంది రైతులకు 96 కోట్ల 63 లక్షల 22 వేల రూపాయలు ఆర్దికసాయం అందించామని అన్నారు.జిల్లాలో ఈ పథకానికి 72 వేల 58 మంది రైతులు నమోదు కాగా మరణించిన 256 మంది రైతులలో ఇప్పటి వరకు 167 మంది రైతు కుటుంబాలకు 8 కోట్ల 35 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించామని,ఇప్పటి వరకు జిల్లాలో 1.98 కోట్ల మంది మహిళలు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేయగా 105.87 కోట్ల రూపాయలు ఆదా జరిగిందని వివరించారు.జిల్లాలో 1,38,747 రేషన్ కార్డులు ఉండగా వాటిలో 3,93,919 మంది సభ్యులు నమోదై ఉన్నారని వీరి కోసం ప్రతి నెలా 2,530 టన్నులు బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహాలక్ష్మి గ్యాస్ పథకం ద్వారా 500 రూపాయలకే గ్యాస్ సిలెండర్ అందిస్తున్నామని,ఈ పథకం ద్వారా జిల్లాలో 68,311 మంది కుటుంబాలకు లబ్ధిచేకూరినట్లు తెలిపారు. వానాకాలంలో 25,309 మంది రైతుల నుండి 1,17,107 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసి 279.64 కోట్లు మరియు 54.63 కోట్లు బోనస్ చెల్లించామని అన్నారు. అలాగే యాసంగిలో ఇప్పటి వరకు 10,833 మంది రైతుల నుండి 80 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసి 79 కోట్ల 30 లక్షలు చెల్లింపు చేశామని తెలిపారు. జిల్లాలో 47,093 ఉచిత వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని తెలిపారు. 200 యూనిట్లులోపు విద్యుత్తు వినియోగిస్తున్న 60,599 మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు గృహాజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని,ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ పథకం ద్వారా 5 లక్షల రూపాయల బీమా అందించను న్నామని వివరించారు.సమ్మక్క–సారక్క మహిళా జిల్లా సమాఖ్యలో 87,134 మంది మహిళలు 364 గ్రామ సంఘాల్లో 8,355 సంఘాలు నమోదైఉన్నాయన్నారు.

వ్యవసాయ ఆధారిత జీవనోపాధుల క్రింద ఆహార ఉత్పత్తి గోదాం నిర్మాణానికి 30 లక్షలు, అదే విధంగా పశు ఆధారిత జవనో పాధుల క్రింద 1.18 కోట్లు మంజూరు చేశామని వివరించారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి ద్వారా జిల్లాలోని 11 మండలాల లోని మహిళా స్వయం సహాయక సంఘాలకు 11 ఆర్టీసి బస్సులు అద్దెకు పెట్టగా ఇవ్వగ ప్రతినెలా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆదాయం వస్తున్నదని పేర్కొన్నారు.ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకమని, పాఠశాలలు పున:ప్రారంభం నాడు 21 వస్తువులతో విద్యార్థులకు వెల్కమ్ కిట్స్ అందచేయ నున్నామని అన్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో జిల్లాకు గుర్తింపు తెచ్చిన ముగ్గురు క్రీడాకారులకు 10 వేలు చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలతో సత్కరించామని తెలిపారు.ప్రభుత్వం కొలువుదీరిన 48 గంటల్లోనే 5 లక్షలున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచి, జిల్లా ప్రధాన ఆసుపత్రిలో 9.6 కోట్లతో అదనపు అంతస్థు నిర్మాణం, 4 కోట్లతో సిటి స్కాన్, 40 లక్షలతో వెంటిలేటర్లు ఏర్పాటు చేశామని, మరో 12 కోట్లతో ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఓసి వర్గాల యువతకు ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం అనే ప్రతిష్టాత్మక పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సంకీర్త్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఎఎస్పీ నరేష్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, గ్రంధాలయ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 03.06.2026
www.mudranews.in | @mudranews



**ఆరోగ్య సంరక్షణ & వైద్య నిధి**



వర్షాకాలంలో వచ్చే జలుబు, జ్వరాలు, వైరల్ ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవడానికి ముందే కొంత మెడికల్ ఎమర్జెన్సీ ఫండ్ సిద్ధంగా ఉంచుకోవాలి. అలాగే ఇంట్లోనే ప్రాథమిక మందులు అందుబాటులో ఉంచుకోవడం వల్ల క్లినిక్‌లు, ఫార్మసీల చుట్టూ తిరిగే అదనపు ఖర్చులు తగ్గుతాయి.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

-.సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ



**ముద్ర, తుంగతుర్తి:** జిల్లాలో పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ మంగళవారం తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ పరిసరాలు, పోలీస్ సామగ్రి, రికార్డులు, ఫిర్యాదుల నిర్వహణ, దర్యాప్తు విధానాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల దర్యాప్తులో సాంకేతిక ఆధారాలు, బలమైన సాక్ష్యాలతో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు. సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లు, విలేజ్ హిస్టరీ షీట్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలను ప్రోత్సహించాలని, కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. నేరప్రవృత్తి కలిగిన వారిపై రౌడీషీట్లు, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.సైబర్ మోసాలు, గంజాయి వ్యాప్తిపై ప్రత్యేక నిఘా ఉంచామని, ప్రజలు అపరిచితుల మాటలు నమ్మి డబ్బులు చెల్లించవద్దని సూచించారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు విక్రయించే వ్యక్తుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ నాగేశ్వరరావు, ఎస్సైలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదు

**పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఎమ్మెల్యే సామేలు**



**ముద్ర, తుంగతుర్తి:** తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించబోమని ఎమ్మెల్యే మందుల సామెల్ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అమరవీరుల త్యాగాలు, ప్రజల పోరాటాలే కారణమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే మందుల సామెల్ విలేకరులతో మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రం అమరవీరుల త్యాగాలు, 14 ఏళ్ల ఉద్యమం, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సహకారంతో సాధించుకున్నదని అన్నారు. తెలంగాణ అనేది ఆత్మగౌరవానికి ప్రతీక అని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షల ఫలితంగా ఏర్పడిందని పేర్కొన్నారు.ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, అవి తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై వ్యతిరేక భావన వ్యక్తం చేసే వ్యాఖ్యలు సముచితం కాదని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఎవరైనా మాట్లాడితే ప్రజలు సహించరని హెచ్చరించారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి జీవిస్తున్నారని, రాష్ట్రాల విభజన అనంతరం ఏర్పడిన సమస్యలను పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాలు, నీళ్లు–నిధుల సాధన కోసం ఏర్పడిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ



**ముద్ర, తుంగతుర్తి:** తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ జిల్లా టీయూడబ్ల్యూజే(ఐజేయు) ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అక్రెడిటేషన్ కమిటీ మెంబర్ శంకరమంచి రవీందర్ శర్మ తెలంగాణ అవతరణ దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ చేతుల మీదుగా జిల్లా అక్రిడేషన్ కార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ శర్మ మాట్లాడుతూ అక్రిడేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించడం హర్షదాయకమని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు.

## కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ

**మాజీ మంత్రి పువ్వాడ**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆవిష్కరించారు.బీఆర్ఎస్ పతాకాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ వస్తే 11 రోజులు పస్తులు ఉన్న పవన్ కళ్యాణ్ వచ్చి నవ నిర్మాణం చేస్తాననడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు.కేసీఆర్ బీఆర్ఎస్ హయాంలో జరిగినంత ఖమ్మం జిల్లా అభివృద్ధి ఎప్పుడు ఎవరూ చేయలేదని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య,మాజీ నగర,మండల అధ్యక్షులు పగడాల నాగరాజు,వీరు నాయక్, మాజీ చైర్మన్లు కూరాకుల నాగభూషణం,గుండాల(RJC) కృష్ణ,ఖమర్,బచ్చు విజయ్ కుమార్,నాయకులు గిరిబాబు మనీషా లక్ష్మి,ఉద్యమ నాయకులు ఉప్పల వెంకట రమణ,బొమ్మెర రామ్మూర్తి, తిరుమల్ రావు,తాజుద్దీన్ మాజీ కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ,మక్బుల్,శీలంశెట్టి వీరభద్రం,నాగండ్ల కోటేశ్వరరావు,కూరాకుల వలరాజు,పసుమర్తి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థికాభివృద్ధికి 'క్యూర్, ప్యూర్, రేర్'తో శ్రీకారం

-డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
-కోటి 15 లక్షల కుటుంబాలకు 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకం
- ఉచిత బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌తో విద్యా రంగంలో సరికొత్త విప్లవం
-పేదల సొంతింటి కల నిజం చేస్తూ సాగుతున్న సంక్షేమ రథం – 'ఇందిరమ్మ ఇళ్లు'
-ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాక ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా కల్పించే "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం"ను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు.ఖమ్మం, జూన్ 2 (ముద్ర ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉప



ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుంచి 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు పెంచే ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా అందించే "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం"ను ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు.ఖమ్మం జిల్లాలో తొలి విడతలో మంజూరైన 16,243 ఇందిరమ్మ ఇళ్లకు రూ.441 కోట్లు విడుదల చేయగా, 8,291 ఇళ్ల గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద రూ.500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల మంజూరు ద్వారా పెద్దఎత్తున లబ్ధి చేకూరిందన్నారు.రాబోయే విద్యా సంవత్సరం నుంచి ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ విద్యార్థులకు ఉచిత అల్పాహార పథకం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఐదు యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం కొనసాగుతోందన్నారు.మహిళా సంఘాలకు రుణాలు, వడ్డీ రాయితీలు, రైతులకు రైతు భరోసా నిధులు, సాగునీటి ప్రాజెక్టుల పనులు, రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వైద్య రంగంలో ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది మందికి ఉచిత వైద్యం అందించామని, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవనం నిర్మాణం తుది దశలో ఉందని తెలిపారు.తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబాలు, మీడియా ప్రతినిధులకు భట్టి విక్రమార్క రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తాం

–రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కొత్తగూడెం ప్రగతి మైదానం లో జాతీయ జెండా ఆవిష్కరణ
- అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన మంత్రి

**ముద్ర, కొత్తగూడెం:** అమరుల త్యాగాల పునాదులు మీద అవతరించింది తెలంగాణ అని ఆ అమరుల త్యాగాల స్ఫూర్తిగా సీఎం రేవంత్ నాయకత్వంలో ప్రజా పాలన అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రగతి మైదానం లో జాతీయ



జెండా ఆవిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను గోదావరి జలాలతో సస్య శ్యామలంగా మారేలా సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఆయిల్ ఫామ్ సాగు లో ఉద్యాన పంటల సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అగ్ర స్థానంలో ఉందన్నారు. ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. దేశానికే తలమానికంగా మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెం లో స్థాపించామని తెలిపారు. జిల్లాలో ఐదు నియోజక వర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేసినట్టు వివరించారు. జిల్లా సమగ్ర అభివృద్ధి పారిశ్రామిక ప్రగతి కోసం రహదారులు నిర్మాణం చేపట్టామని, భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యం ఉండేలా రైల్వే కనెక్టివిటీ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్టు తెలిపారు. కొత్తగూడెం లో ఎయిర్పోర్ట్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు పాటిస్తు నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. కొత్తగూడెం పట్టణం మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పాటుతో అభివృద్ధి బాట పడిందన్నారు. తొలుత అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్.క్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం







**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 99 రోజుల "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక"ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో 2.17 కోట్ల మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 1.28 లక్షల మంది లబ్ధిదారులకు రూ.25.91 కోట్ల సబ్సిడీ అందించామని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో 9,618 ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 4,591 ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని, లబ్ధిదారుల ఖాతాల్లో రూ.222.95 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నామన్నారు.విద్యా రంగంలో 10వ తరగతి పరీక్షల్లో జిల్లా 98.3 శాతం ఉత్తీర్ణత సాధించగా, 192 పాఠశాలలు 100 శాతం ఫలితాలు నమోదు చేశాయని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నామని, దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, పాత్రికేయులు, బ్యాంకర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ, యాదాద్రి భువనగిరి జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలపడానికి అందరూ కలిసి పనిచేయాలని గుత్తా సుఖేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.

### ఊరు వాడల తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా వ్యాప్తంగా జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి అశోక్ గౌడ్ ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అక్షాంశ్ యాదవ్, జిల్లా కోర్టు ఆవరణలో ప్రత్యేక అదనపు జిల్లా న్యాయమూర్తి మిలింద్ కాంబ్లీ, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యమకారుల త్యాగాలను స్మరించారు.

### అమరుల ఆకాంక్షలను సాధిద్దాం



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** తెలంగాణ ఉద్యమ అమరుల ఆకాంక్షల సాధన లక్ష్యంగా ముందుకు సాగుదామని టీజేఏసీ 2009 జిల్లా కోఆర్డినేటర్ ధర్మార్జున్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం లో మార్కెట్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి టీ జేఏసీ సూర్యాపేట ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కారులు పూలమాల వేసినివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ నాయకులు మండారి డేవిడ్ కుమార్, గండూరి రమేష్, , గట్ల రమ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రగతికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, పారిశుధ్య సేవలు అందించేందుకు మున్సిపాలిటీ కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, వైస్ చైర్మన్ షఫి ఉల్లా, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### స్వర్ణగిరిలో హోమం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** స్వర్ణ గిరి మహాక్షేత్రంలో 108 హోమ గుండాలచే మహా సుదర్శన నరసింహ హోమాన్ని 108 మంది ఋత్వికులతో, 333 మంది దంపతులు ఏకకాలంలో హోమాన్ని మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు హోమంలో పాల్గొన్నారు..శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి ఆశీస్సులతో నిర్వాహణ కార్యక్రమాన్ని పూర్తిగా వుప్పల సంతోష్ కుమార్ చేయటం జరిగిందని ఆలయ ప్రధాన అర్చకులు, దిట్ట కవి శ్రవణాచార్యులు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 03.06.2026
www.mudranews.in | @mudranews



### వ్యాపార అవకాశాలను అందుకోవడం



ఈ సీజన్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండే పుస్తకాలు, వర్షాకాల సామగ్రి, లేదా వ్యవసాయ పరికరాల వ్యాపార రంగాలలో పెట్టుబడి పెట్టే వారికి ఇది మంచి సమయం. వినియోగదారుల అవసరాలను ముందే అంచనా వేసి సరైన స్టాక్ ఉంచుకుంటే భారీగా లాభాలు గడించవచ్చు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**-గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి**

**-మంత్రి వివేక్ వెంకటస్వామి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి, గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక ఉపాధి, శిక్షణ, పరిశ్రమలు, గనుల భూగర్భ, ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మెదక్ కలెక్టరేట్ లో జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు పుష్పాంజలి ఘటించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలు వేశారు. త్యాగాలు, ఉద్యమకారుల పోరాట స్ఫూర్తి ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ...ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తూ ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐక్యత, సౌభ్రాతృత్వంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు.

జిల్లా మహిళా సంఘాలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 102 కోట్ల 35 లక్షల జంబో చెక్కును మంత్రి అందజేశారు. శంకరం పేట (ఆర్) మండలం దరిపల్లి గ్రామానికి చెందిన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరి పత్రాలు అందించారు. మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్ ఉత్తమ. పోలీసు సేవా పురస్కారం, డీసీఆర్బీ ఎస్ఐ బి. విట్టల్, ఏఎస్ఐ రుక్సానా బేగం పోలీస్ సేవ పథకాలను మంత్రి అందజేశారు.

విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులను మంత్రి అభినందించి, మెమెంటోలు అందజేశారు. వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రదర్శన ఏర్పాటు చేయగా మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పి శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, గ్రంథాలయల చైర్మన్ సుహాసిని రెడ్డి, ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, పాల్గొన్నారు.

**అమర వీరుల త్యాగం వల్ల..**

తెలంగాణ ప్రజల ఉద్యమం, అమరుల త్యాగం వల్ల తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేస్తే చాలామంది అపహాస్యం చేశారని,అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ కోసం మద్దతు పలికాయన్నారు. చిన్న శంకరంపేట్ ఆర్ మండల కేంద్రంలో గల అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరులకు నివాళులు అర్పించారు.

## ప్రపంచ యోగాసనా పోటీలకు జడ్జిగా సతీష్



**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట:**
ప్రపంచ యోగాసన పోటీలకు టెక్నికల్ అఫీషియల్ జడ్జిగా సిద్దిపేటకు చెందిన యోగా గురువు తోట సతీష్ ఎంపికయ్యారు. ప్రస్తుతం వ్యాయామ ఉపాధ్యాయునిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాయణరావుపేట నందు పని చేస్తున్నారు. జూన్ 4 నుంచి 8 వరకు గుజరాత్ లోని అహ్మదాబాద్ లో మొట్టమొదటి సారి నిర్వహిస్తున్న వరల్డ్ యోగాసన ఛాంపియన్షిప్ పోటీలకు ఆయన ఎంపిక కావడం విశేషం. ఈ పోటీలకు దాదాపు 50 దేశాల నుండి క్రీడాకారులు పాల్గొనబోతున్నారు. విద్యార్థి దశలోనే జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిన సతీష్ అంచెలంచెలుగా ఎదుగుతూ యోగ గురువుగా, రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యులుగా, దేశ , విదేశాల యోగ సాధకులకు ఆన్లైన్ ద్వారా యోగ మార్గదర్శకునిగా పేరు గాంచారు.

# ప్రత్యేక గుర్తింపు వచ్చేలా పని చేయాలి

**-మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర ప్రతినిధి, సిద్ది పేట:**
చేసే పనిలో ప్రత్యేక గుర్తింపు వచ్చేలా పని చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ జిల్లా అధికారులకు సూచించారు. మంగళవారం ఐడిఓసి లోని స్టేట్ చాంబర్లో రాష్ట్ర మంత్రివర్యులు జిల్లా కలెక్టర్ కె.హైమావతి, కమిషనర్ పోలీస్ సాధన రష్మీ పెరుమాల్ తో కలిసి జిల్లా అధికారులతో సాధారణ సమీక్షనిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని వాటిని క్షేత్రస్థాయిలోకి సుకువెళ్లి పేద ప్రజలకు అందించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. వివిధ శాఖలకు కేటాయించిన పనులను మూస ధోరణిలో కాకుండా ప్రత్యేక పద్ధతిలో చేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కానున్నం దున కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు తీసుకోవాలని వాటిలో ముఖ్యంగా వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలను పెంచి పచ్చదనం రూపొందించేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా పంట వైవిధ్యం పై ప్రత్యేక ఫోకస్ పెట్టి విత్తన సరఫరా దారులతో సంప్రదించి వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా గ్రామాలలో పరికి బదులుగా పప్పు దినుసులు, నూనె గింజలు ఇతర కమర్షియల్ పంటలు పండించేలా రైతులను సిద్ధం చేయాలని, అలాగే జిల్లాలో 1లక్ష 50 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరమని కానీ జిల్లాలో 50వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం మాత్రమే పండిస్తున్నారని ఇంకా 1 లక్ష మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం పండించేలా రైతులను చైతన్య పరచాలని, అవసరమైన సన్న రకం వరి విత్తనాలను రైతులకు సరఫరా చేయాలని అన్నారు. బడిబాట కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలలో అందించే నాణ్యమైన విద్య పేద ప్రజలకు అందేలా పాఠశాలలలో ఎన్రోల్మెంట్ చేయించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పంట భూములలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కొత్త మండలాలలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాలని, త్రాగునీరు సరపరాకు ఇబ్బంది కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎలాంటి వేడుకలు, కార్యక్రమాలు నిర్వహించిన అన్ని శాఖల అధికారులు సిబ్బంది తప్పకుండా పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, జిల్లా అటవీ శాఖ అధికారి, ఆర్డీవోలు, అదనపు డిసిపి, ఎసిపి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాల పోరాటంతోనే రాష్ట్రం ఏర్పాటు

**-మాజీ డిప్యూటీ స్పీకర్**

**ఎం. పద్మా దేవేందర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాలు, విద్యార్థులు, ఉద్యోగులు, సబ్బండ వర్గాల సమష్టి పోరాట ఫలితంగానే ఆవిర్భవించిందని, కేసీఆర్ దూరదృష్టి, సుపరిపాలనతో తొలి పదేళ్ల తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్ తో కలిసి జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. ప్రొ. జయశంకర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు నివాళులర్పించారు. మున్సిపల్ సీనియర్ నాయకులు బట్టి జగపతి, కృష్ణరెడ్డి, యం. లావణ్య రెడ్డి, ఆంజనేయులు, సుభ్రభాత్ రావు, మున్సిపల్ కౌన్సిలర్ లు బట్టి ఉదయ్ కుమార్, దీపక్ కుమార్, గంగామణి, కో కన్వీనర్ లు కిష్ట గౌడ్,లింగా రెడ్డి, అంజ గౌడ్, సిచ్. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ కార్యాలయంలో...**

భారతీయ జనతా పార్టీ సహకారంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్య క్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, కౌన్సిలర్లు ఇప్ప అఖిల భరత్, పబ్బ రాజమణి లక్మణ్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, ఎంఎల్ఎన్ రెడ్డి, లోకేష్, మధు, వేణు, బిక్షపతి, శివ, రాణి, శ్యామ్, ప్యాట నగేష్, బాలరాజ్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో...**

మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు . మున్సిపల్ చైర్ పర్సన్ కానుక రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపునూరు చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ అశోక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా గోదావరి పుష్కరాలు

**-ఆధ్యాత్మిక పర్యాటకానికి అత్యధిక ప్రాధాన్యం**

**-6 జిల్లాల్లో కొత్తగా 237 ఘాట్లు నిర్మించాలని ప్రతిపాదనలు**

**-గోదావరి పుష్కరాలు-2027పై సీఎం చంద్రబాబు సమీక్ష**



**ముద్ర, అమరావతి :** వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా పుష్కరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.పుష్కరాల సందర్భంగా సుమారు 10 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలకు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇందుకోసం పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మొత్తం 525 ఘాట్లను సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లకు అదనంగా 237 కొత్త ఘాట్ల నిర్మాణాన్ని ప్రతిపాదించా రు. ఇప్పటికే రూ.211 కోట్లకు పైగా విలువైన 132 అభివృద్ధి పనులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. పుష్కరాలకు కేంద్ర సహాయం పొందడం, ప్రత్యేక రైళ్లు నడపడం, టెంట్ సిటీలు, హోం స్టేలు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. త్వరలో గోదావరి పుష్కరాల లోగోను విడుదల చేసి విస్తృత ప్రచారం చేపట్టనుంది. పుష్కరాల ద్వారా రాజమహేంద్రవరం మహానగరంగా అభివృద్ధి చెందేలా మౌలిక వసతులను మెరుగుపరచాలని సీఎం సూచించారు.
సమీక్షకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, పి.నారాయణ, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, సీఎస్ జి.సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, దేవదాయ, వైద్యారోగ్యం, రవాణా, పర్యాటక, పురపాలక, పంచాయితీరాజ్, ఆర్థిక, జలవనరులు, పోలీసు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర మరువలేనిది



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదులు క్రియాశీలక పాత్ర మరువలేనిదని జిల్లా అదనపు న్యాయమూర్తి జయప్రసాద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా అదనపు న్యాయమూర్తి జయప్రసాద్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో న్యాయవాదులు క్రియాశీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలోని న్యాయవాదులు ఛలో డిల్లీ కార్యక్రమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు.న్యాయమూర్తులు కూడా తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఉద్యమకారులపై పెట్టిన కేసుల పట్ల సానుకూల తీర్పులను ఇచ్చారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నిధులు ,నియామకాలు అనే నినాదంతో రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా సాగిందని కొనియాడారు. రాష్ట్ర ఏర్పాటులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి తెలంగాణ ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. రాష్ట్రం కోసం అమరులైన అమరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పడింది కాబట్టి సిద్దిపేట జిల్లా కోర్టు ఏర్పాటు సహకారమైందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు ప్రభుత్వ పారదర్శకత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు వేముగంటి తరణి, కే . సౌజన్య, కుమార స్వామి, ఏవో ఆసీఫ్ ఇక్బాల్,కోర్టు సిబ్బంది శ్రీహరి, నరహరి, కరుణశ్రీ,బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే.రమేష్ బాబు, కార్యదర్శి సదానందం, న్యాయవాదులు ప్రతి ప్రకాశ్, యస్.జనార్ధన్ రెడ్డి, నగేష్,పల్లెటూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ప్రజా ప్రతినిధులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం వైపు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ కృషి చేస్తున్నది. అందులో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత, కౌన్సిలర్లు రెంజర్ల కళ్యాణి, సోగ్రబి, దాసరి సునీత, జాల మాధవి, సొరుపాక రమాదేవి, మున్సిపల్ అధికారులు, తదితరులు పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పట్టణ ప్రముఖులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com